

కుంభమేళాకు ప్రత్యేక రైలు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జనవరిలో జరగనున్న కుంభమేళాకు గుంటూరు నుంచి ప్రత్యేక రైలుని ఏర్పాటు చేసినట్లు డీఆర్ఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07701 గుంటూరు - అజాంగడ్ రైలు జనవరి 24(శుక్రవారం) రాత్రి 11 గంటలకు గుంటూరులో బయల్దేరి 26న ఉదయం 6.20కి ప్రయాగ్‌రాజ్, మధ్యాహ్నం 12 గంటలకు బనారస్(వారణాసి), సాయంత్రం 5.15 గంటలకు అజాంగడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నంబరు. 07702 అజాంగడ్ - గుంటూరు రైలు జనవరి 26(ఆదివారం) రాత్రి 7.45కి బయలుదేరి 11.20కి బనాసర్, 27న వేకువజామున 4 గంటలకు ప్రయాగ్‌రాజ్, 28న ఉదయం 9 గంటలకు గుంటూరు చేరుకుంటుంది.



బహిరంగ.. సిట్టింగ్‌లు

- ఖాళీ స్థలాలూ మద్యపాన కేంద్రాలు
- గంజాయి గుంపులతో భయానక పరిస్థితి
- మహిళలు, విద్యార్థినుల్లో భయాందోళనలు
- రోడ్లు, కూడళ్లలో మందుబాబుల హల్‌చల్

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, ఖాళీ స్థలాలు, పార్కులు, గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా మందుబాబుల సిట్టింగ్‌లతో సందడిగా మారుతున్నాయి. ఆ పరిసరాల వైపు పురుషులు కూడా వెళ్లేందుకు భయపడుతుంటారంటే మందుబాబుల హల్‌చల్ ఏ స్థాయిలో ఉంటుందో తెలుసుకోవచ్చు. గత వైసీపీ ప్రభుత్వంలో విడతల వారీ మద్యపాన నిషేధం పేరుతో తీసుకువచ్చిన మద్యం పాలసీతో గతంలో రహస్యంగా సాగిన మద్యపానం రోడ్డెక్కింది. అప్పటి ప్రభుత్వంలో ప్రారంభమైన బహిరంగ మద్యపాన అరాచకం కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పర్మిట్ రూములను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడంతో మొదలైన బహిరంగ మద్యపానం నేడు అతి పెద్ద సామాజిక సమస్యగా రూపుదాల్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ ఈ ప్రమాదాన్ని అరికడుతుందని అంతా భావించారు కానీ.. నేటికీ ఈ సామాజిక జాడ్యం ప్రజలను వెంటాడుతోంది. 2019కి ముందు వరకూ మద్యం దుకాణాలు ప్రైవేటు యాజమాన్యాల కింద ఉండేవి. అప్పట్లో మందుబాబులకు షాపు నిర్వాహకులే పర్మిట్ రూములను ఏర్పాటు చేసేవారు. ఆ కారణంగా వారంతా ఆ షాపులోనే మద్యం తాగి ఇళ్లకు వెళ్లేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు లైసెన్సును రద్దు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేసింది. దీంతో అప్పటి వరకూ నాలుగు గోడల మధ్య ఉండే మద్యపాన వ్యవహారం వీధుల్లోకి వచ్చిపడింది. కూటమి ప్రభుత్వం తిరిగి పాత విధానాన్ని ప్రవేశపెట్టినా బహిరంగ మద్యపానాలు మాత్రం గతంలో మాదిరిగానే కొనసాగుతున్నాయి. ఎక్కడంటే అక్కడ మద్యం అందుబాటులోకి రావడంతో మందుబాబులు ఎక్కడికక్కడే సిట్టింగ్ వేస్తున్నారు. దర్జాగా రోడ్ల సమీపంలోనే భైఠాయించి నిస్సంకోచంగా మద్యం తాగుతున్నారు. పట్టణాల్లోని దుకాణాలు, చిల్లరకొట్లు, షాపుల ముందుండే అరుగులు, ఫుట్‌పాత్‌లు, ఇళ్ల మధ్యలో ఉండే ఖాళీ స్థలాలు, రోడ్డు మార్జిన్లు, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలు, బస్ షెల్టర్లు, కల్వర్టులు, పబ్లిక్ పార్కులు, పాఠశాల ప్రాంగణాలు, గ్రామాల్లో ఉండే ముఖ్యమైన కూడళ్లను ఆక్రమించివేస్తున్నారు. నలుగురు కలిసి అక్కడే కూర్చుని మద్యం తాగుతున్నారు. మందుబాబులు గుంపులు, గుంపులుగా పోగుపడే విధానం వచ్చిన తర్వాత దాన్ని ఆసరా చేసుకుని గంజాయి గుంపు కూడా వీధుల్లోకి వచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో గంజాయి విచ్చలవిడి చలామణి కారణంగా ముక్కుపచ్చలారని చిన్నారులు సహా అనేక మంది యువకులు గంజాయి మహమ్మారికి అలవాటు పడ్డారు. వారంతా మందుబాబులను ఆసరా చేసుకుని బహిరంగ ప్రదేశాల్లోనే గంజాయి తీసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్వయంగా స్థానిక ఎమ్మెల్యేలకే ప్రజలు గంజాయి, మందుబాబుల గుంపుల భైఠాయింపు, దాడులపై ఫిర్యాదులు చేసిన సందర్భాలు అనేకం జిల్లాలో ఉన్నాయి. బహిరంగంగా గంజాయి, మద్యపానం కారణంగా ఉనికిలోకి వచ్చిన అరాచక గుంపులు సమాజానికి పెనుసవాలుగా మారుతున్నాయి. మహిళలు, విద్యార్థులు, యువతులు బయటికి రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. మహిళలపై అఘాయిత్యాలు నిత్యకృత్యంగా మారిన నేపథ్యంలో అత్యవస రమైన పనులున్నా కూడా బయటికి రావడానికి జంకుతు న్నారు. గడిచిన ఐదేళ్లలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగాయి. అత్యాచారాలు, హత్యలు, సామూహిక దాడులు మహిళలపై లెక్కకు మించి పెరిగాయి. ఎక్కడో దూరంగా జరిగే ఘటనలు జిల్లాలో రోజువారీ ఘటనలుగా మారిపోయి భయానక వాతావర ణం నెలకొంది. ఈ పరిస్థితిని చక్కదిద్ది, మహి ళా భద్రతకు భరోసా కల్పించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన తాజా మద్యం పాలసీ మహిళలకు నిరాశనే మిగిల్చింది. పర్మిట్ రూము విధానం అమలు చేయకపోవడంతో బహిరంగ మద్యపానం నేటికీ రాజ్యమేలుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక మందుబాబుల వీధి విహారం యథేచ్ఛగా సాగుతోంది.



పీసీ చైర్మన్లుగా.. పులుకూరి పంతాని

- సాగర్, కేడబ్ల్యూడీల ఎన్నిక ఏకగ్రీవం
- వైఎస్ చైర్మన్లుగా చక్రపాణి, సునీల్‌చౌదరి
- ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ
- పల్నాడు, బాపట్ల జిల్లాలకు సాగర్ పీసీ పదవుల పంపకం
- బాపట్ల, గుంటూరు జిల్లావాసులకు కేడబ్ల్యూడీ పీసీ పదవులు
- ఆయకట్టు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా అడుగులు వేస్తామన్న నేతలు



నాగార్జున సాగర్ పీసీ చైర్మన్‌గా ఎన్నికైన పులుకూరి కాంతారావు, వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణికి డిక్లరేషన్ పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే యరపతినేని, ఎస్పీ పీ కృష్ణమోహన్



కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన పంతాని మురళీధరరావును అభినందిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు ఆనందబాబు, రామాంజనేయులు.

సాగునీటి రంగాన్ని అస్తవ్యస్తం చేశారు.. సంఘాలను విస్మరించారు.. కాల్వల మరమ్మతులు మరిచారు.. అన్నదాతల గోడు అరణ్య రోదనగా మార్చారు.. మొత్తం మీద వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగం సంక్షోభంలో చిక్కుకుంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జలవనరులకు జవసత్వాలు తీసుకు వచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. తొలుత సాగునీటి ఎన్నికలు నిర్వహించింది. ఈ క్రమంలో ఈ నెల 14 నుంచి ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టగా శనివారం పీసీ చైర్మన్ల ఎంపికతో ఆ క్రతువు ముగిసింది. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలోని నాగార్జున సాగర్ కుడి కాల్వ, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో సాగర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ ఎన్నిక జరగ్గా చైర్మన్‌గా పులుకూరి కాంతారావు, వైఎస్ చైర్మన్‌గా ఉప్పలపాటి చక్రపాణిలను ఎన్నుకున్నారు. అమృతలూరు మండలం కూచిపూడిలోని కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన ఎన్నికలో చైర్మన్‌గా పంతాని మురళీధరరావు, వైస్ చైర్మన్‌గా నువ్వుల సునీల్‌చౌదరిలను ఎన్నుకున్నారు. టీసీలు, డబ్ల్యూయూఏ, డీసీల పదవులలో అధ్యక్షులు ఇప్పటికే కొలువుతీరగా పీసీ చైర్మన్ల ఎన్నిక కూడా ముగియడంతో ఇక సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టడానికి పదవుల్లో కొలువుదీరిన వారు కృషి చేసే దిశగా ప్రభుత్వం మార్గనిర్దేశనం చేయనుంది.

కారంపూడి డీసీ అధ్యక్షుడే చైర్మన్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా పల్నాడు జిల్లా గురజాలకు చెందిన పులుకూరి కాంతారావు(కారంపూడి డీసీ అధ్యక్షుడు)ను, బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఉప్పలపాటి చక్రపాణి(కొనంకి డీసీ అధ్యక్షుడు)ని డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంతారావు, చక్రపాణిలకు కలెక్టర్ అరుణ్‌బాబు డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. వీరిని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జలవనరులశాఖ ఎస్సీ కృష్ణమోహన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మురళి, ఇరిగేషన్ ఈఈ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలోని డీసీల అధ్యక్షులు ఎన్నికకు హాజరయ్యారు. పీసీ చైర్మన్‌గా కాంతారావుకు రెండేళ్లు, తదుపరి మూడేళ్లు గోగినేని కోటేశ్వరరావు పేర్లను టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసిన విషయం తెలిసిందే.

కాల్వ బాగుకు కృషి చేస్తాం : చైర్మన్, వైస్‌చైర్మన్లు

వైసీపీ ఐదేళ్ల పాలనలో పాడుబెట్టడంతో అధ్వానస్థితికి చేరిన సాగర్ కాల్వల బాగుకు తాము కృషి చేస్తామని చైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్‌చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి తెలిపారు. సాగునీటి కాల్వల్లో గడ్డిపరక కూడా తొలగించలేదని కాంతారావు తెలిపారు. కుడి కాల్వ చివరి భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కాల్వల పరిధిలోని సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. కాల్వలను

(మిగతా 8వ పేజీలో)

మోర్తోట డీసీ అధ్యక్షుడే చైర్మన్

అమృతలూరు, బాపట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా రేపల్లె నియోజకవర్గ పరిధిలోని మోర్తోట డీసీ అధ్యక్షుడైన పంతాని మురళీధరరావును ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా చేబ్రోలు డీసీ అధ్యక్షుడైన కాకుమాను మండలానికి చెందిన నువ్వుల సునీల్‌చౌదరిని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు పరిధిలోని 22 మంది డీసీలు హాజరు కాగా చైర్మన్ పదవికి మురళీధరరావు పేరును మొఖమాటం రాధాకృష్ణమూర్తి, వైస్ చైర్మన్ పదవికి సునీల్‌చౌదరి పేరును దడ్డుకూటి బూషబాబు ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు. వెలుగొండ ప్రాజెక్టు ఎస్‌ఈ అబూదలేమ్, ఆర్డీవో రామలక్ష్మి చైర్మన్, వైఎస్ చైర్మన్లకు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఎస్‌ఈ వెంకటరత్నం, చీరాల డీఈ ఎన్‌కేవీ ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భ్రష్టుపట్టించారు : మంత్రి పార్థసారథి

గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని భ్రష్టుపట్టించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఎన్నిక అనంతరం మంత్రి, వేమూరు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు చైర్మన్, వైఎస్‌చైర్మన్లను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగు నీటి రంగాన్ని నిర్లక్ష్యం చేసి రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. సాగు నీటి రంగం కోసం చంద్రబాబు రూ.వేల కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే వాటిని నాశనం చేసేదాకా జగన్ నిద్రపోలేదన్నారు. గత ప్రభుత్వం చేతకానితనం వల్ల సాగు నీటి రంగం

(మిగతా 8వ పేజీలో)

8

ఇద్దరు రైల్వే అధికారులకు జాతీయ అవార్డులు

హాస్టల్ విద్యార్థిని ప్రసవం

- నొప్పులు రావడంతో జీజీహెచ్‌కు తరలింపు
- అక్కడ ఆడబిడ్డకు జన్మనిచ్చిన యువతి

గోవా నుంచి గుంటూరుకు అక్రమ మద్యం రవాణా

6

- పట్టుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్‌ని కాపాడేందుకు తెరచాటు ప్రయత్నాలు

- ఎన్‌వోసీ జీవోని సవరిస్తూ రహస్య ఉత్తర్వులు
- ఆర్‌టీఐ ద్వారా సేకరించిన టీడీపీ నాయకులు
- సీఎం చంద్రబాబుకు నివేదన

మోటుమర్రి వద్ద నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు

పలు రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

బెదిరించి రూ.24 లక్షలు వసూలు

- వైసీపీ నేతలపై బార్ యజమాని ఫిర్యాదు
- టీడీపీ కేంద్ర కార్యాలయాన్ని ఆశ్రయించిన రంగారావు

నరసరావుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు తనను బెదిరించి రూ.24 లక్షలు వసూలు చేశారని నరసరావుపేట పట్టణానికి చెందిన బార్ యజమాని నాదెండ్ల రంగారావు తెలిపారు. తన నుంచి అక్రమంగా వసూలు చేసిన నగదును ఇప్పించాలని బాధితుడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణలను కోరారు. గత ప్రభుత్వం బార్ అండ్ రెస్టారెంట్ల ఏర్పాటుకు టెండర్లు పిలవగా తాను టెండర్ వేయడానికి ప్రయత్నిస్తే అప్పటి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ వెంకటరావు పిలిచి టెండర్ వేస్తే కేసుల్లో ఇరికిస్తామని బెదిరించా దన్నారు. అయినా టెండర్ వేసి బార్ లైసెన్స్ దక్కించుకున్నట్లు చెప్పారు. ఫీజు చెల్లించిన తర్వాత ఎక్సైజ్‌శాఖ నుంచి లైసెన్స్ కాపీ ఇవ్వకుండా ఎమ్మెల్యే గోపిరెడ్డితో మాట్లాడాలని సదరు అధికారులు చెప్పారన్నారు. ఈ క్రమంలో తనను బెదిరించి వైసీపీ నేతలు పిల్లి ఓబులరెడ్డి, బీరం భాస్కర్‌రెడ్డి రూ.24 లక్షలు తీసుకున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆయన మంత్రిని కోరారు.

యువతకు ఉపాధి అవకాశాల్లో చేయూత

● ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, గౌతు శిరీష


సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, గౌతు శిరీష

గుంటూరు(విద్య), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రస్తుత విద్యార్థులకు చేయూత అందిస్తామని, తమ ఆధ్వర్యంలో ఉన్న కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశాలు కల్పిస్తామని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులైన ఎమ్మెల్యేలు గౌతు శిరీష, వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. చౌడవరంలోని కళాశాలలో శనివారం సందడి వాతావరణంలో 1995-99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హాజరైన ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము (గుడివాడ), గౌతు శిరీష(పలాస) మాట్లాడుతూ విద్యార్థి దశలో గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరువేసుకునే ఈ ఆత్మీయ సమ్మేళనం, జీవితంలో మరువలేని ఒక అద్భుత ఘట్టం అన్నారు. ఉజ్వల భవిష్యత్తును అందించిన కళాశాలను మరువ కూడదని, రాష్ట్రంలోనే కాకుండా, దేశంలో కళాశాల అగ్రస్థానంలో ఉండటం తమకు గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో యార్లగడ్డ వెంకన్న చౌదరి, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్‌అండ్‌డి డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్వీ ఎస్.వి. శ్రీనివాసరావు, కళాశాల పూర్వ విద్యార్థుల విభాగం కన్వీనర్ డాక్టర్ స్వర్ణశ్రీ, అధ్యక్షులు రత్న ప్రసాద్, కళాశాల వివిధ శాఖల విభాగాధిపతులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

పురుషుల ఖోఖో పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో రామకృష్ణ

గుంటూరు(విద్య), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీజేపీఎస్ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఖోఖో పురుషుల అంతర కళాశాల పోటీలు శనివారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజు పోటీలను శాప్ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, డీఎస్‌డీవో పి.నరసింహారెడ్డి తదితరులు ప్రారంభించారు. మొదటి రోజు పోటీల్లో విక్టరి డిగ్రీ కళాశాల, డీసీఆర్‌ఎం, డిగ్రీ కళాశాల ఇంకొల్లు, వాగ్దేవి డిగ్రీ కళాశాల, కృష్ణవేణి డిగ్రీ కళాశాలల వారు లీగ్‌లలో ప్రవేశించినట్లు యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ వీపీ సత్యపాల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాలల కార్యదర్శి కేవీ బ్రహ్మం, వాసవి విద్యానిధి కమిటీ అధ్యక్షుడు పొట్టి సుబ్రహ్మణ్యం, కళాశాల వ్యాయామ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ: రిక్షా కార్మికుడు మృతి

పిట్టలవానిపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని రిక్షా కార్మికుడు మృతి చెందాడు. చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ కథనం ప్రకారం కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామానికి చెందిన కుంచల శివారెడ్డి(53) పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలో రిక్షాబండి తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కుంచల చిన సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముఖ్యమంత్రి కార్యాలయ ఫిర్యాదులపై నిర్లక్ష్యం

● వారాల తరబడి పట్టించుకోని పోలీసులు
● సీఎం ఆదేశించినా స్పందించని వైనంపై బాధితుల్లో ఆందోళన
● ఎట్టకేలకు సీఎంఓ ఫిర్యాదులపై దృష్టి సారించిన ఎస్పీ
● ఆయా ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్‌హెచ్‌ఓలకు హెచ్చరికలు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే ఫిర్యాదులపై కొందరు పోలీసు అధికారుల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుండడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రే ఆయా ఫిర్యాదులపై త్వరితగతిన విచారణ జరిపి ఫిర్యాదులోని అంశాలు వాస్తవమైతే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు కుమ్మక్కై పెద్ద ఎత్తున భూ కబ్జాలకు, తప్పుడు కేసులకు, అక్రమాలకు పాల్పడ్డారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలపై వచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేయకుండా అడ్డుపడ్డారు. ఫలితంగా ఎంతోమంది బాధితులు అన్యాయానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వినూత్నంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడంతో నాటి వైసీపీ అక్రమాలు ఎన్నో వెలుగులోకి వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు, పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు స్వీకరిస్తుండగా, మంత్రి నారా లోకేశ్ తన క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. స్వీకరించిన ఫిర్యాదులను వారు సంబంధిత జిల్లాల కలెక్టర్లకు, ఎస్పీలకు పంపుతూ తక్షణం విచారించి చర్యలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, అదేవిధంగా మంత్రి లోకేశ్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజు ఆయా కార్యాలయాల్లో బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటుండగా రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో బాధితులు ఆయా కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. దీనిలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి కూడా పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. తాము నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను, వారు అందుబాటులో లేని సమయంలో ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి ఫిర్యాదు చేశామని తమకు న్యాయం జరుగుతుందని బాధితులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే బాధితుల ఎదురుచూపులు రోజులు వారాలు దాటి నెలలు గడుస్తున్నా సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి బాధితులకు ఎటువంటి సమాచారం రాకపోతుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. మరికొందరైతే తమ ఫిర్యాదులపై స్పందించలేదంటూ తిరిగి ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్తున్నారు. ఈ విధంగా సీఎంఓ నుంచి, అదే విధంగా మంత్రి లోకేశ్, హోం మంత్రి అనిత కార్యాలయాల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు జిల్లాలకు అందుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో బాధితులకు న్యాయం జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా కొందరు అధికారులు ఆయా ఫిర్యాదులపై మొక్కుబడిగా స్పందిస్తూ ఉన్నతాధికారులకు సమస్య పరిష్కారమైనట్టుగా ఏదో సమాధానం పంపుతున్నారు. సివిల్ వివాదమనో, గతంలోనే చర్యలు తీసుకున్నామనో తిరుగు సమాధానం పంపి చేతులు దులుపుకుంటున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. మొత్తంగా చూస్తే సీఎంవో, మంత్రి లోకేశ్, హోం మంత్రి అనిత తదితరుల పేషీల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో అనేక మంది బాధితులు తిరిగి సోమవారం పోలీస్ కార్యాలయంలో జరిగే ఎస్పీ గ్రీవెన్స్‌కు హాజరై తాము సీఎంఓ, మంత్రి లోకేశ్, హోం మంత్రి అనిత తదితరుల కార్యాలయాల్లో ఫిర్యాదు చేశామని అయినప్పటికీ న్యాయం జరగలేదని వాపోతూ ఫిర్యాదులు చేస్తున్నారు. కొన్ని స్టేషన్‌లలో అయితే ఆయా ఫిర్యాదులను కనీసం చదవకుండానే పక్కన పడేస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆయా ఫిర్యాదులకు కనీస ప్రాధాన్యం ఇవ్వకపోవడం పట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రతి ఫిర్యాదును వారు తమ రిజిస్టర్లో నోట్ చేసుకొని దానికి ఒక నెంబర్ కేటాయించి సంబంధిత జిల్లాలకు పంపిస్తున్నారు. వాటిపై తీసుకున్న చర్యలకు సంబంధించి (యాక్షన్ టేకెన్ రిపోర్ట్) సమాధానం పంపాలంటూ కోరుతున్నారు. అత్యధికంగా జిల్లా కలెక్టర్లకు, అదేవిధంగా కొన్ని జిల్లా ఎస్పీ కార్యాలయాలకు ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపుతున్నారు. అయితే ఆ విధంగా పోలీస్‌స్టేషన్లకు వెళ్లిన ఫిర్యాదుల్లో అనేకం కనీసం విచారణకు కూడా నోచుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

సీఎంఓ ఫిర్యాదులపై నిర్లక్ష్యం పట్ల ఎస్పీ ఆగ్రహం

ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల కార్యాలయాల నుంచి వచ్చే ఫిర్యాదులపై కొందరు పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం పట్ల జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు సీఎం, ఇతర మంత్రులు, డిజిపి కార్యాలయాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై దృష్టి సారించి స్టేషన్ల వారీగా వచ్చిన ఫిర్యాదులు ఎన్ని, తీసుకున్న చర్యలు ఏమిటి ..? పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయి..? అందుకు గల కారణాలు ఏమిటి అనే దానిపై విశ్లేషిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా కార్యాలయాల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోలీస్ అధికారులపై చర్యలకు కూడా సిద్ధమైనట్లు సమాచారం. జిల్లాకు సంబంధించి నాలుగైదు పోలీస్ స్టేషన్లలో ఆయా ఫిర్యాదులు నెలల తరబడి పేరుకుపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పోలీస్ స్టేషన్‌ల వారీగా సీఎంవో నుంచి వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి తీసుకున్న చర్యలు, పెండింగ్ ఫిర్యాదులు వంటి వాటిపై కసరత్తు జరుగుతోంది. పెండింగ్ పిటిషన్లకు సంబంధించి ఆయా స్టేషన్ల జాబితాలో పాత గుంటూరు, నల్లపాడుతో పాటు మరికొన్ని స్టేషన్‌లు ఉన్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు అయా ఫిర్యాదులపై జరిగిన జాప్యం నేపథ్యంలో ఇక నుంచి అయినా ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకునేందుకు ఎస్పీ సతీష్ కుమార్ అన్ని పోలీస్ స్టేషన్‌లకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ఫిర్యాదుల్లో వాస్తవికతపై విచారణ జరిపి అందులో వాస్తవం ఉంటే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

సమాజ వికాసానికి విద్యార్థులు దోహదపడాలి


డీజీపీ ద్వారకా తిరుమలరావును సత్కరిస్తున్న ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజ వికాసం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమనీ, అందుకు తగినట్లుగా నేటితరం విద్యార్థులు అడుగులు వేయాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీహెచ్ ద్వారకా తిరుమలరావు సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శనివారం ఇండక్షన్ అండ్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమానికి డీజీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని సైబర్ నేరాలు, డ్రగ్స్ ముప్పు వంటి ముఖ్యమైన సమస్యలపై అవగాహన కల్పించారు. డిజిటల్ యుగంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు తమతోపాటు సమాజాన్ని రక్షించుకోవడానికి బాధ్యతాయుతమైన ప్రవర్తనను అలవర్చుకోవాలని కోరారు. ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె.గంగాధరరావు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. విద్యార్థులు వినూత్న పరిష్కారాలను అన్వేషించాలని, సాంకేతిక పురోగతికి సహకరించాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ సమాజాభివృద్ధి, దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సిద్ధయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గోవా నుంచి గుంటూరుకు అక్రమ మద్యం రవాణా

● పట్టుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు


నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ శ్రీనివాసులు, ఏఈఎస్ వరదకుమారి

గుంటూరు (కార్పొరేషన్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి గుంటూరుకు ఎన్‌డీపీ మద్యాన్ని తరలించి గుంటూరులో ఒక ప్రాంతంలో రహస్యంగా దాచి మద్యాన్ని సరఫరా చేస్తున్న ఒక కానిస్టేబుల్‌తోపాటు మరో ఐదుగురిని గుంటూరు టూటౌన్ ఎక్సైజ్ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు శనివారం వివరాలు వెల్లడించారు. గోవా నుంచి గుంటూరుకు ఎన్‌డీపీ మద్యాన్ని తీసుకువచ్చి అమ్ముతున్నారు. సత్తెనపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ వెంకమ్మశెట్టి మహేష్‌బాబు, గుంటూరుకు చెందిన బాజీబాబు, లక్ష్మారెడ్డి, గోపికృష్ణ, రామిశెట్టి శ్రీనివాసు, గోరంట్లకు చెందిన తుమ్మా మంగమ్మ తదితరులు సిండికేట్‌గా మారి మద్యాన్ని యథేచ్ఛగా అమ్ముతున్నారు. నాలుగు రోజుల క్రితం గుంటూరులో గోవా మందు అమ్ముతున్నట్టు ఎక్సైజ్ అధికారులకు అందిన సమాచారం మేరకు ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించగా మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. 555 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కానిస్టేబుల్ మహేష్‌బాబుతోపాటు మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచినట్టు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. సమావేశంలో గుంటూరు ఈఎస్ అరుణకుమారి, ఏఈఎస్ మారయ్యబాబు, టూటౌన్ సీఐ , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ప్రసవించిన విద్యార్థిని

● హాస్టల్‌లో నొప్పులు రావడంతో జీజీహెచ్‌కు తరలింపు
● అక్కడ ఆడబిడ్డకు జన్మనిచ్చిన యువతి
● ఘటనతో ఉలిక్కిపడిన ప్రభుత్వ వర్గాలు
● పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి తల్లిదండ్రులు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నడిబొడ్డున అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉండే సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో ఓ విద్యార్థినిని ప్రసవించింది. నగరంలోని జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, అదేవిధంగా కలెక్టర్, ఎస్పీ, ఐజి క్యాంపు కార్యాలయాలు, మరోవైపు నగరం పాలెం స్టేషన్... నిత్యం వీఐపీల రాకపోకలతో కట్టుదిట్టమైన భద్రత నడుమ కొనసాగే సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్లో ఓ విద్యార్థినిని ప్రసవించడం సంచలనం రేకెత్తించింది. . కలెక్టరేట్‌కు, కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి నడుమ పరివర్తన పేరుతో నడుస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో ఓ విద్యార్థిని శుక్రవారం రాత్రి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటనతో ప్రభుత్వ వర్గాలు ఉలిక్కిపడ్డాయి. విద్యార్థిని ప్రసవించే వరకు విషయం బయటకు రాకపోవడం పట్ల అధికార యంత్రాంగంతో పాటు పోలీసు వర్గాలు సైతం విస్మయానికి గురయ్యాయి. అసలు హాస్టల్స్‌లో ఏమి జరుగుతోంది..? నిఘా ఉందా..? వార్డెన్స్ ఏం చేస్తున్నారు..? వంటి అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తమ కుమార్తె కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుంటుందని కలలుగన్న తల్లిదండ్రులు ఈ వార్తతో షాక్‌కు గురయ్యారు. పరివర్తన హాస్టల్‌లో ఉంటూ చిలకలూరిపేట రోడ్డులోని ఫార్మసీ కళాశాలలో ఈ విద్యార్థిని బి ఫార్మసీ రెండో సంవత్సరం చదువుతుంది. ప్రకాశం జిల్లా దర్శి ప్రాంతానికి చెందిన 19 సంవత్సరాల విద్యార్థినికి శుక్రవారం రాత్రి నొప్పులు రావడంతో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. హాస్టల్‌లో ఉంటూ చదువుకోవాల్సిన యువతి తల్లి కావడం సంచలన కలిగించింది. ఓ విద్యార్థిని గర్భం దాల్చి ప్రసవించే వరకు ఎలా కనుక్కోలేకపోయారు అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.

ప్రేమ పేరుతో మోసం చేసిన బావ

తాజాగా పరివర్తన భవనంలో ఆడబిడ్డకు జన్మనిచ్చిన యువతి తన మేనమామ కుమారుడి చేతిలో మోసపోయినట్లు తేలింది. దర్శి మండల పరిధిలోని ఓ గ్రామం కాగా, అదే గ్రామానికి చెందిన తనకు వరుసకు బావ అయ్యే వినోద్ అనే యువకుడు ఆమెను ప్రేమ పేరుతో లొంగదీసుకున్నట్లు తెలిసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెకు శారీరకంగా దగ్గరయ్యాడు. అయితే ఆ యువతి ప్రసవించే వరకు ఆమె గర్భవతి అనే విషయం ఇక్కడ హాస్టల్ వార్డెన్‌కు గాని, అక్కడ గ్రామంలోని తల్లిదండ్రులకు గాని తెలియదు. విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు శనివారం సాయంత్రం గుంటూరుకు చేరుకున్నారు. జీజీహెచ్‌లో ఉన్న బాలింతను తల్లిదండ్రులు కలిసి బోరున విలపించారు. అయితే వినోద్ నుంచి గాని ఆయన కుటుంబ సభ్యుల నుంచి గాని ఎటువంటి సానుకూలమైన స్పందన రాలేదు. వాస్తవానికి వినోద్ పెళ్లికి అంగీకరిస్తే ఈ విషయాన్ని రెండో కంటికి తెలియకుండా తమ కుమార్తెకు వివాహం చేయాలని తల్లిదండ్రులు భావించారు. వినోద్ కూడా పెళ్లికి అంగీకరిస్తారని ఆ యువతితో పాటు ఆమె తల్లిదండ్రులు కూడా భావించారు. ఆ యువతి తల్లిదండ్రులు ఎట్టకేలకు శనివారం రాత్రి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండలానికో గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా రీసర్వే


గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేని నూతనంగా ముందుకు తీసుకెళ్లాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో డ్రోన్ ఫ్లయింగ్ పూర్తి కావడం, కొన్ని గ్రామాలు మినహా చాలావాటికి ఓఆర్‌ఐలు రావడంతో మిగతా ప్రక్రియని పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని నిర్ణయించింది. రీసర్వేని పటిష్టవంతంగా పూర్తి చేసేందుకు పైలట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసింది. గుంటూరు జిల్లాలో మొత్తం 14 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా రీసర్వే చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. తాడికొండ(లచ్చన్నగుడిపూడి), మేడికొండూరు (మందపాడు), తుళ్లూరు (వడ్డమాను), పొన్నూరు (జడవల్లి), దుగ్గిరాల (పెరికలపూడి), చేబ్రోలు (మంచాల), కాకుమాను (పాండ్రపాడు), ఫిరంగిపురం (మేరిగపూడి), ప్రత్తిపాడు (మల్లాయపాలెం), పెదకాకాని (అనుమర్లపూడి), గుంటూరు పశ్చిమ (చినపలకలూరు), గుంటూరు తూర్పు (జొన్నలగడ్డ), తెనాలి(పెదరావూరు), కొల్లిపర(కుంచవరం) గ్రామాల్లో రీసర్వే తొలి దశలో జరగనుంది. ఈ గ్రామాల్లో మొత్తం భూముల విస్తీర్ణం 22,961 ఎకరాలున్నాయి. రోజుకు కేవలం 20 ఎకరాల్లో మాత్రమే రీసర్వేని నిర్వహిస్తారు. గ్రామాన్ని బ్లాకులుగా విభజించి బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో వీఆర్‌వో, వీఆర్‌ఏ, ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక మండల సర్వేయర్ కూడా ఉంటారు. అడంగల్ ప్రకారం రైతులకు నోటీసులు ఇచ్చి రీసర్వే ప్రక్రియని వారి కనుసన్నల్లోనే చేపడతారు. రీసర్వేకి సంబంధించి గ్రామాల్లో దండోర వేసి చెబుతారు. అలానే గ్రామసభలు కూడా నిర్వహిస్తారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, పాత హద్దురాళ్లు వంటివి అన్ని ప్రదర్శిస్తారు. జిల్లాలో మొత్తం 173 గ్రామాలుండగా వైసీపీ హయాంలో 62 చోట్ల రీసర్వే పూర్తి అయింది. ఓఆర్‌ఐ(ఆర్థోరెక్టిఫైడ్ రాడార్ ఇమేజ్) మ్యాప్‌లు సుమారు 64 గ్రామాలకు ఇంకా అందాల్సి ఉన్నట్లు సర్వే శాఖ ఏడీ పవన్‌కుమార్ తెలిపారు. ఇవి కూడా త్వరలోనే జిల్లాకు చేరతాయని చెప్పారు. ఏమైనా వివాదాలుంటే డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో జరిగే మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టులలో పరిష్కరించుకోవచ్చని సూచించారు.

పరిమళ కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ


పరిమళ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువతి నాగశ్రీ వందన పరిమళ భౌతికకాయానికి శనివారం అంత్యక్రియలు జరిపించారు. వారం రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పరిమళ భౌతిక కాయం శుక్రవారం రాత్రి తెనాలి గాంధీనగర్‌లోని ఇంటికి చేరింది. భౌతికకాయాన్ని చూసేందుకు స్థానికులు భారీ సంఖ్యలో వచ్చారు. ఆమె తల్లిదండ్రులు రోధిస్తున్న తీరు వారికి కంటతడి పెట్టించింది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మృతదేహానికి నివాళులర్పించారు. పరిమళ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

రెండు స్టేషన్‌లలో డెల్టా ఎక్స్‌ప్రెస్ నిలుపుదల పునరుద్ధరణ



వేమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌ను రెండు స్టేషన్‌లలో నిలుపుదల పునరుద్ధరణకు ఎట్టకేలకు రైల్వేశాఖ స్పందించింది. 2020 నుంచి ఐదేళ్లపాటు తెనాలి-రేపల్లె మార్గంలోని వేమూరు, పల్లెకోన స్టేషన్‌లలో డెల్టా ఎక్స్‌ప్రెస్ స్టాప్‌లను రైల్వే శాఖ నిలిపివేసింది. దీంతో ఈ రెండు స్టేషన్‌ల పరిధిలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై రైల్వే శాఖ దృష్టికి అనేక వినతి పత్రాలు వెళ్లాయి. ఎక్స్‌ప్రెస్ రైలును రెండు స్టేషన్‌లలో నిలుపుదలను పునరుద్ధరించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఈ విషయాన్ని నాటి ఎంపీ నందిగం సురేష్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన మాత్రం స్పందించలేదు. గుంటూరు జిల్లా రైల్వే బోర్డు కమిటీ సభ్యులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఢిల్లీలోని రైల్వేశాఖ ప్రధాన కార్యాలయానికి ప్రత్యేకంగా లేఖలు పంపారు. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. దీనిపై ఒత్తిడి పెరగడంతోపాటు కూటమి ప్రభుత్వానికి చెందిన బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ స్వయంగా ఢిల్లీలోని రైల్వేశాఖ ఉన్నతాధికారులతో చర్చించి వెంటనే ఉత్తర్వుల కోసంగా కృషి చేశారు. శుక్రవారం రైల్వే శాఖ డిప్యూటీ కమిషనర్ దీనిపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 23 నుంచి వేమూరు, పల్లెకోన స్టేషన్‌లలో కూడా ఎక్స్‌ప్రెస్ నిలుపుదల పునరుద్ధరణకు ఆదేశాలు జారీ అయ్యాయి. టైంటేబుల్‌ను కూడా ప్రకటించారు. రైలు నంబరు 17645 డెల్టా ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ నుంచి వేమూరుకు రాత్రి 7.15 గంటలకు చేరుకుని 7.16 గంటలకు బయలుదేరి రేపల్లెకు వెళ్లనుంది. రైలు వేళలను వేమూరు, పల్లెకోన స్టేషన్ల పరిధిలో విస్తృతంగా ప్రచారం చేయాలని డిప్యూటీ కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96.104.115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 40.57 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని ఆయన తెలిపారు.

జోన్ డైరీ

● కారంపూడి మండలంలోని పేటసన్ని గండ్ల గ్రామంలో నిర్మించిన కళ్యాణ మండపాన్ని ఆదివారం మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించనున్నారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్

నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 577.40 అడుగులు ఉంది. ఇది 275.51 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7086 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6401 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,072 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 46,259 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 26,245 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

నేడు మెగా జాబ్ మేళా

సత్తెనపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి నియోజక వర్గంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకే ఆరు నెలల్లోనే రెండవ సారి జాబ్ మేళాను సత్తెనపల్లిలో నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో తాను పాల్గొన్నప్పుడు పలువురు నిరుద్యోగ యువకులు తనను కలసి నిరుద్యోగ సమస్య గురించి చెప్పారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని వారికి హామి ఇచ్చానని కన్నా పేర్కొన్నారు. ఇచ్చిన హామి మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు నెలల్లోనే రెండవ సారి పలు కంపెనీలతో చర్చించి ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం సత్తెనపల్లి పట్టణంలోని విద్యా కేంద్రం డిగ్రీ కళాశాల ఆవరణలో మెగా మేళా నిర్వహిస్తున్నామని కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సత్తెనపల్లి నియోక వర్గం లోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఆయన కోరారు. మొత్తం 33 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయని, రెండు వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంగా జాబ్ మేళా కొనసాగుతుందన్నారు.




భూమిపూజ చేస్తున్న వీరాస్వామి యాదవ్

సీసీ రోడ్ల నిర్మాణానికి

భూమి పూజ

మాచర్ల రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మానందపురం తండాలో రూ. 5 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాచర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా కార్యదర్శి రామిశెట్టి సైదారావు, జనసేన మండల అధ్యక్షుడు సాంబశివరావు, వెంకటేశ్వర్లు, రవినాయక్, అంజయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో టీడీపీ నేతలు

టీడీపీ సభ్యత్వ నమోదు

మాచర్లటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే గేటు వద్ద శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నేతలు పార్టీ సభ్యత్వం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మోసిన్, ఆటోమొబైల్ జానీ, ఖలీల్, ముజఫర్, నాగూర్‌బాషా, కొమ్ము రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు

ధ్యానం దోహదం

పెదకూరపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మానసిక ప్రశాంతతకు ధ్యానం ఎంతో అవసరమని, విద్యార్థి దశ నుంచే ధ్యానం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని యోగా ప్రొఫెసర్ కొటికకలపూడి లక్ష్మి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో శనివారం ప్రపంచ ధ్యాన్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మట్లాడుతూ విద్యార్థులు ధ్యానం చేయటం వల్ల ఏకాగ్రతతో పాటు ఆత్మస్థైర్యం, సహనం, ఓర్పు అలవాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధ్యానం పై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ లక్ష్మి

రైతు సంక్షేమమే చంద్రబాబు ఆశయం

● ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనే యులు
● ఘనంగా సాగర్ కుడి కాలువ పీసీ చైర్మన్, వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం



ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన పులుకూరి కాంతారావును సత్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ అరవిందబాబు

దాచేపల్లి, నరసరావుపేట,పెదకూరపాడు, డిసెంబరు 21, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిరైతు కుటుంబం సంతోషంగా ఉండాలని, ఆర్థిక ప్రగతి సాధించాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయమని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనే యులు తెలిపారు. సమృద్ధిగా సాగు నీరు, పంటలకు గిట్టుబాటు ధరలు, ఇతర సౌకర్యాలు కల్పించడం ద్వారా రైతుల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. నరసరావుపేట భువనచంద్ర టౌన్‌హాల్లో శనివారం నిర్వహించిన నాగార్జున్‌సాగర్ ప్రాజెక్టుకమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్‌చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి ప్రమాణస్వీకారోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన రాష్ట్రంలో రైతులకు నీటి భద్రత కల్పించాల్సి ఉందని, పోలవరంతో పాటు 6 ప్రధాన ప్రాజెక్టుల్ని శరవేగంగా పూర్తిచేయడం లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. కొత్తగా ఎన్నికైన నీటిసంఘాల కమిటీలు ఆయకట్టులో ప్రతిచివరి ఎకరాకు సక్రమంగా నీళ్లందేలా పర్యవేక్షించాలన్నారు. రైతుల ప్రయోజనాల కోసం కష్టపడి పనిచేయాని, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. గోదావరి పెన్నా అనుసంధానాన్ని త్వరలోనే పూర్తి చేసి 9.61 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో బొల్లాపల్లి రిజర్వాయర్ కూడా వచ్చి తీరుతుందన్నారు. వరికెపూడిశెల ప్రాజెక్టుకోసం ఎమ్మెల్యేలు, ఎంపీలంతా సీఎంతో మాట్లాడామని, ఈ ప్రాజెక్టును కూడా త్వరలోనే పూర్తిచేస్తామని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. సభలో సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కాంతారావు, వైస్ ఛైర్మన్ ఉప్పలపాటి చక్రపాణిని ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, తెలుగుదేశం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, తితిదే పాలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్, ఘనంగా సత్కరించారు.

నాగార్జునసాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పదవి గురజాల నియోజకవర్గంలోని పులిపాడు గ్రామానికి చెందిన పులుకూరి కాంతారావుకు దక్కడం ఈ ప్రాంత వాసులకు ఎంతో గౌరవప్రదమని దాచేపల్లి మాజీ ఎంపీపీ అంబటి నవకుమార్ అన్నారు. శనివారం నరసరావుపేటలో నిర్వహించిన ప్రాజెక్టు కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గురజాల నియోజక వర్గం నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. డీసీ ఛైర్మన్ పదవుల కేటాయింపులో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కాపు, బీసీ వర్గాలకు సమప్రాధాన్యమిచ్చారని అన్నారు. కార్యక్ర మంలో ఆయనతో పాటు తంగెడ మేజర్ డీసీ ఛైర్మన్ పగడాల భాస్కరరావు, డీసీ మాజీ వైస్ ఛైర్మన్ బొమ్మి రెడ్డి సత్యం, తదితరులు ఉన్నారు.

పెదకూరపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నేత, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు వడ్లమూడి అప్పారావును టీడీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ శాలువాతో ఘనంగా సత్కరించారు.



డీసీ కమిటీ చైర్మన్ అప్పారావును శాలువాతో సత్కరించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

ఏసు చూపిన మార్గంలో పయనిద్దాం



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న కమిషనర్ షమ్మి

సత్తెనపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ఏసు ప్రభు చూపిన శాంతిమార్గంలో పయనించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జీ రవి అన్నారు. పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో శనివారం అర్బన్ హెల్త్ సెంటర్ల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్మించారు. వేడుకల్లో పాల్గొన్న రవి మాట్లాడుతూ పొరుగు వారిని ప్రేమించటమే నిజమైన క్రిస్మస్ అన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో పనిచేసే క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు హనుమా నాయక్, పద్మావతి, ఆసియా, మహమ్మద్ ఆలీ, అనూషా, ధర్మసింగ్ శాస్త్రి, గుజ్జర్లపూడి మార్కురావు, స్కైలాబ్ పాల్గొన్నారు.

పట్టణంలోని ఐఎంఏ హాల్లో శనివారం సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, మునిసిపల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడు కలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న మునిసిపల్ కమిషనర్ షమ్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఏసు చూపిన మార్గంలో పయనించాలన్నారు. ఏసుప్రభు ప్రపంచానికి శాంతిసందేశాన్ని అందించార న్నారు. అనంతరం కేక్‌కట్ చేసి పంపిణీ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఫెడరేషన్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు సందెపోగు శ్రీనివా సరావు, మునిసిపల్ మేనేజర్ ఎం.సాంబశివరావు, డీఈ వెంకట రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారథి, టీపీఎస్‌లు సునీత, రిజ్వాన, సచివాలయ ఉద్యోగులు పీ రవిచంద్ర, చిలుకా ప్రదీప్, సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.20 కోట్లతో

త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

రెంటచింతల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలువాయి గ్రామంలో వ్యవసాయానికి, గృహాలకు వేర్వేరుగా విద్యుత్ ఫీడర్లు ఏర్పాటు చేస్తున్నామని అందులో భాగంగా ప్రభుత్వం రూ.1.20 కోట్లు విడుదల చేసిందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ నూతలపాటి సింగయ్య తెలిపారు. శనివారం పాలువాయి గ్రామంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లలో లోపం ఏర్పడితే గ్రామాల్లో విద్యుత్ సమస్య ఏర్పడేదని, త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో ఇప్పటి నుంచి ఆ సమస్య ఉండదని అన్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్లన్నింటిని 63 కేవీ, 100 కేవీ సామర్థ్యం గల వాటితో అనుసంధానం చేస్తామన్నారు. రీవ్యాంప్‌డ్‌డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ కింద ఈ నిధులు మంజూరయ్యాయన్నారు.

సాదాసీదాగా సమావేశం

రెంటచింతల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పి.సంపూర్ణమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. నూతన ఎజెండాలపై చర్చ, తీర్మానాల ఆమోదం వంటివి ఏమీ లేకుండానే సమావేశాన్ని ముగించారు. ఖాళీస్థలం కలిగి నవారు గృహనిర్మాణాలకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుందని ఏఈ శ్రీనివాస్ స్పష్టం చేశారు. గోకులాలు, గడ్డి పెంపకం, వేసవిలో నీటి ఎద్దడి నివారణ, ఉపాధిహామీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణం పలు అంశాల గురించి ఆయాశాఖల అధికారులు వివరించారు. సమావేశంలో ఈవో పీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీవో జయచంద్ర, ఎంపీటీసీలు,సర్పంచ్‌లు, ఏఈలు పాల్గొన్నారు.



గణిత దినోత్సవాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా

గణిత దినోత్సవం


పిడుగురాళ్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తుమ్మల చెరువు గ్రామంలోని బోధి పాఠశాలలో శనివారం శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన గణిత వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శించారు. విద్యార్థులకు గణితశాస్త్రం పోటీలు, సెమినార్లు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ సునీతారెడ్డి మాట్లాడుతూ రామానుజన్ స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ విద్యార్థులు గణితంపై ఎక్కువ మక్కువ పెంచుకోవా లన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి): గణిత మాంత్రికుడు రామానుజన్ జయంతి శనివారం అంబేడ్కర్ నగర్ పాఠశాలలో హెల్ప్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌన్సిలర్ తురగా మేరీ గ్రేస్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు లెక్కల పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస రావు, కచర్ల బుల్లిబాబు తదితరులు గణిత ఉపాధ్యాయుడును సన్మానించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్రప్రదేశ్

నకరికల్లు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలలో మూడో శనివారాన్ని స్వచ్ఛ శనివారంగా పాటిస్తూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత పనులు నిర్వహించాలని ఈవోపీఆర్‌డీ కేవీఎస్ ప్రసాదు తెలిపారు. శనివారం నరసింగపాడులోని సచి వాలయ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. సచివాలయ భవనాన్ని శుభ్రపరిచారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే పుల్లారావు, మండల సర్వేయర్ వెంకటే శ్వర్లు, ఆర్ఐ పురుషోత్తం, పంచాయతీ కార్యదర్శి కొమ్మవరపు అప్పారావు పాల్గొన్నారు. నకరికల్లులో సచి వాలయ పరిసరాలను శుభ్రంచేశారు. ప్రధాన వీధుల్లో బ్లీచింగ్ చల్లి పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ కే శివ ప్రసాదు పాల్గొన్నారు.

సత్తెనపల్లిరూరల్,(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద శనివారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. గ్రామాల్లోని రోడ్లవెంబడి చెత్తాచెదారాన్ని తొలగించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలను ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరెడ్డితో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది తొలగించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది సిబ్బంది పాల్గొన్నారు.



నరసింగపాడు సచివాలయంలో పారిశుధ్య పనులు..

క్రోసూరు,(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామి పథకం కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయం మొత్తాన్ని ఉద్యోగులు, అధికారులు శుభ్రంచేశారు. ప్రతి నెల మూడవ శనివారం కార్యాలయాల్లో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం జరుగుతుందని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వెంకటస్వామి, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే

● సత్తెనపల్లి శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

సత్తెనపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎన్జీవో హోంలో పెన్షనర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్స్ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం బొడ్డు రామారావు అధ్యక్షతన సత్తెనపల్లి యూనిట్ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జక్కుల లక్ష్మీ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా కేబీఆర్‌కే ప్రసాదు, కోశాధికారిగా కైపు రంగారెడ్డితో పాటు 23 మంది కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు, కే పోతులూరయ్య, ప్రభుదాసు, రామ కోటయ్య, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను

క్యాబినెట్ నుంచి తొలగించాలి

పెదకూరపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను క్యాబినెట్ పదవి నుంచి తొలగించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఘంటా గోపీ ఉన్నారు. పెదకూరపాడులోని అంబేద్కర్ విగ్రహం వద్ద పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వైఖరిని నిరసిస్తూ శనివారం అంబేద్కర్‌విగ్రహం ముందు లక్ష అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోడేటి సందీప్, ప్రధాన కార్యదర్శి పగడాల ప్రసాదులు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పలు మార్లు అంబేద్కర్‌ను అమిత్‌షా అవమాన పరిచార న్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ ప్రతినిధులు గడ్డం రవి కుమార్, పోపూరి రవి పాల్గొన్నారు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ పొందిన ఏపీజెన్‌కో ఏడీఈ రత్తయ్య


క్రీడలతో ఆరోగ్యం

రెంటచింతల,డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతులుగా వుండటానికి క్రీడలు దోహదపడాయని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు జీఎం జి.శ్రీనివాస్ అన్నారు. ఇంటర్ ప్రాజెక్ట్ గేమ్స్‌కు సంబంధించి క్రికెట్ పోటీల్లో విజేతలైన ప్రాజెక్టు ఉద్యోగులను శనివారం ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రైట్ బ్యాంక్ విద్యుత్ ఉద్యోగులు 20 ఓవర్లలో 184 పరుగులుచేయగా టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఉద్యోగులు 19.2 ఓవర్లకు 185 పరుగులు తీసి విజేతగా నిలిచారు. వారిలో ఏడీ ఈ రత్తయ్య మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. క్రీడల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ వేంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, రత్తయ్య, రాజేష్, ప్రాజెక్టు అధికారులు పలువురు పాల్గొన్నారు.

ధాన్యంలో తేమ శాతం 17 కంటే తక్కువ ఉండాలి

● మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్

క్రోసూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ధాన్యంలో తేమ శాతం 17 కటే తక్కువ ఉండేలా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారివీ. వేణుగోపాల్ సూచించారు. శనివారం పలుగ్రామాల్లోని ధాన్యం కల్లాల వద్దకువెళ్ళిన ఆయన ధాన్యాన్ని అమ్ముకొనే విషయంలో రైతులకు పలు సూచనలు చేశారు. రైతు సేవా కేంద్రాలు ధాన్యం కొనుగోలు చేయటానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. రైతులు గోనె సంచులు, హమాలీలు, రవాణా చార్జీలు వారి సొంతంగా ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వ లెక్కల ప్రకారం చెల్లిస్తుందన్నారు. 40 కిలోల గోనె సంచికి రూ.3.39, క్వింటాకు హమాలీ చార్జి రూ.17.17 రవాణా చార్జీలు స్థానికంగా నిర్ణయించి చెల్లింస్తున్నట్లు తెలిపారు. ఆధార్ నెంబరుకు అనుసంధానం చేసిన రైతుల ఖాతాల్లోకి ధాన్యం కొనుగోలు నగదు నేరుగా జమ అవుతుందన్నారు. సాధారణ రకం ధాన్యం 75 కిలోల బస్తాకు రూ 1725, వంద కిలోల బస్తాకు రూ 2300, గ్రేడు - ఏ రకం 75 కిలోల బస్తాకు రూ 1740, వంద కిలోల బస్తాకు 2320 మద్దతు ధర ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు.



రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో వేణుగోపాల్



సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

సబ్ జైలులో న్యాయాధికారుల తనిఖీ

సత్తెనపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సబ్ జైలును జిల్లా ప్రధాన న్యాయాధికారి పార్థసారథి, సివిల్ జడ్జి లీలావతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న ముద్దాయిలతో మాట్లాడి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహార పదార్థా నాణ్యతను తనిఖీ చేశారు. కోర్టు కేసులకు అవసరమైన న్యాయ సహాయం గురించి ముద్దాయిలతో మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్, ప్యానల్ న్యాయవాది కోటేశ్వరరావు, పారా లీగల్ వాలంటర్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

నిరు పేదలకు వరం సీఎం సహాయ నిధి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ● లబ్ధిదారుడికి చెక్కు అందజేత

బెల్లంకొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయ నిధి నిరు పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. శనివారం బెల్లంకొండ మండలం మాచాయపాలెం గ్రామానికి చెందిన పమిడిపాటి శ్రీనివాసరావుకు రూ.67,205 చెక్కును ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గుంటూరులోని తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ నిరు పేదలు వైద్యం ఖర్చులకు భరించలేని వారు సీఎం సహాయ నిధి దరఖాస్తు చేసుకుంటే వైద్య ఖర్చులకు నగదు అందజేస్తారని తెలిపారు. అనంతరం శ్రీనివాసరావుకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ నేత, మాజీ ఎంపీటీసీ గుడిసె కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త వైద్య ఖర్చులకు నగదు అందజేత

మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మైనార్టీ నాయకుడైన షేక్ బాజీ బుడే కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి శనివారం బాజీ బుడే గృహానికి వెళ్ళి వైద్య ఖర్చులకు రూ.5వేలు నగదు అందజేశారు.



అవార్డు అందుకున్న సత్తెనపల్లి డిపో మేనేజర్ విజయ కుమార్

సత్తెనపల్లి ఆర్టీసీ డిపోకి అవార్డు

సత్తెనపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇందన పొదుపు వారోత్సవాల్లో భాగంగా 2024 సంవత్సరానికి సత్తెనపల్లి ఆర్టీసీ డిపోకు గోల్డ్ క్యాటగిరి కింద అవార్డు లభించిందని డిపో మేనేజర్ విజయ కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం విజయవాడలోని ఆర్టీసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్టీసీ ఉన్నతాధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్టు డిపో మేనేజర్ తెలిపారు. ఇందనం ఎక్కువగా పొదుపు చేసినందుకు గాను ఈ అవార్డు లభించిందని ఆయన తెలిపారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

● రైతులు, గ్రామస్థుల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
● వేగంగా సమస్యలను పరిష్కరించాలని అధికారుల ఆదేశాలు

పిడుగురాళ్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయి. శనివారం పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుండి 11 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ తెలిపారు. సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ సుధాకరశర్మ, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనుబాబు, సర్వే డిటి సుబ్బారావు, విఆర్ఓలు, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలంలోని కేశానుపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 4 అర్జీలు వచ్చినట్లు దాచేపల్లి తహసీల్దార్ వైవీ కుటుంబరావు తెలిపారు. తహసీల్దార్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు తక్కెళ్లపాడు, కేశానుపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

రెంటచింతల, (ఆంధ్రజ్యోతి): రెంటచింతల పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో రైతుల నుంచి 11 దరఖాస్తులు స్వీకరించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ నగేష్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ బ్రహ్మయ్య,ఆర్ఐ పల్లా రామకృష్ణ,వీఆర్వో నాసరరెడ్డి, కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రబాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలువురు గ్రామస్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్య ఏదైనా తమ దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించు కోవచ్చని తెలిపారు. సదస్సులో గ్రామ పెద్దలు కుంభా ఏడుకొండలు, నలగోపు కొండలు, తిమ్మిశెట్టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర మైన అచ్చంపేటలోని రెండవ సచివాలయంలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు మండల తహసీల్దార్ కే.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా 72 అర్జీలు రాగా రెండు పరిష్కరించారు. కాగా అచ్చంపేటలోని వాగును ఆక్రమిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించాలని ఒక దరఖాస్తు అందింది. ఈ సదస్సులో రెవెన్యూ సిబ్బందితో పాటు టీడీపీ నాయకుడు తిరువాయిపాటి ఆంజనేయులు పాల్గొన్నారు.

- ఎన్‌వోసీ జీవోని సవరిస్తూ రహస్య ఉత్తర్వులు
- ఆర్‌టీఐ ద్వారా సేకరించిన టీడీపీ నాయకులు
- సీఎం చంద్రబాబుకు నివేదన

గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్‌ని కాపాడేందుకు తెరచాటు ప్రయత్నాలు



గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నడిబొడ్డున తగిన అనుమతులు లేకుండా నిర్మిస్తున్న గ్రీన్‌గ్రేస్ హైరైజ్డ్ బిల్డింగ్స్‌ని కాపాడేందుకు పైస్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. కీలకమైన రైల్వే ఎన్‌వోసీ రద్దుకు సంబంధించి సవరణలు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుగుదేశం పార్టీ నాయకులకు సమాచారం అందింది. మునిసిపల్ పరిపాలన శాఖలోనే కొంతమంది హైరైజ్డ్ బిల్డింగ్స్‌ని నిర్మిస్తున్న వైసీపీ నేత అంబటి మురళీకృష్ణకు సానుకూలంగా అన్ని వ్యవహారాలు చక్కబెడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఎన్‌వోసీ రద్దు సవరణ ఉత్తర్వులు రహస్యంగా విడుదల చేయడం ఇందుకు ఊతమిస్తున్నది. రహస్య జీవో సమాచారాన్ని ఆర్‌టీఐ ద్వారా సేకరించిన టీడీపీ నేతలు విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

భజరంగ్ జూట్‌మిల్లుకు చెందిన వివాదాస్పద స్థలాన్ని వైసీపీ నేత అంబటి మురళీకృష్ణ తన ఆధీనంలోకి తీసుకొని తొలుత ఐదు అంతస్తుల అపార్టుమెంట్ల నిర్మాణానికి మునిసిపల్ పరిపాలన శాఖ నుంచి అనుమతులు పొందారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో రివైజ్డ్ ప్లాన్ దరఖాస్తు చేసి దానికి అనుమతి రాకముందే 15 అంతస్తుల భవన సముదాయాలను నిర్మించారు. ఈ క్రమంలో ఎన్నో నిబంధనలను అతిక్రమించారు. గుంటూరు - నల్లపాడు రైలుమార్గానికి ఆనుకునే నిర్మాణాలు చేపట్టారు. రైల్వే నుంచి ఐదు అంతస్తుల భవన సముదాయాలకు మాత్రమే ఎన్‌వోసీ తీసుకొన్నారు. ఎప్పుడైతే అంతకంటే ఎక్కువ అంతస్తుల నిర్మాణం చేపట్టారో రైల్వే శాఖ తాను జారీ చేసిన ఎన్‌వోసీ రద్దు అయినట్లే భావించాలని పేర్కొంటూ తగిన చర్యలు చేపట్టాలని నగరపాలకసంస్థ అధికారులకు సమాచారం ఇచ్చింది. అయితే అప్పట్లో అంబటి మురళీకృష్ణ సోదరుడు అంబటి రాంబాబు మంత్రిగా ఉండడంతో ఏ ఒక్క ప్రభుత్వ శాఖ అధికారి, సిబ్బంది గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్ ప్రాంగణంలోకి అడుగుపెట్టే సాహసం చేయలేకపోయారు.

కాగా ఎన్నికల్లో వైసీపీ చిత్తుచిత్తుగా ఓటమిపాలై ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆర్‌టీఐ ద్వారా ఉల్లంఘనలన్నింటిని వెలుగులోకి తీసుకొచ్చారు. 15 అంతస్తులకు బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ రాకపోవడం, సెట్‌బ్యాక్స్ సరిగా లేకపోవడం, రైలు పట్టాల నుంచి దూరంగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా కేవలం 50 అడుగుల దూరంలోనే నిర్మాణాలు చేయడం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు లేకపోవడం వంటివి అనేక ఉల్లంఘనలు బయటకు వచ్చాయి. రైల్వే ఎన్‌వోసీ రద్దుపై కోర్టుకు వెళ్లినా అంబటి మురళీకృష్ణకు ఊరట లభించలేదు. కాగా మునిసిపల్ పరిపాలన శాఖలో కొంతమంది ఆయనకు సహకరిస్తున్నారన్న అనుమానాలు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను బట్టి కలుగుతున్నాయి. ఈ క్రమంలో కొంతమంది మునిసిపల్ అధికారులు, మురళీకృష్ణ సామాజికవర్గానికి చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్‌ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని టీడీపీ గుంటూరు జిల్లా నాయకలు సందేహిస్తున్నారు. ఎన్‌వోసీ రద్దు సవరణ జీవోని రహస్యంగా ఇచ్చిన విషయంపై తాడోపేడో తేల్చుకోవాలని భావిస్తున్నారు. దీనిపై సీఎం ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

మోర్తోట డీసీ అధ్యక్షుడే చైర్మన్



కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన సునీల్‌చౌదరికి నియామక పత్రం అందజేస్తున్న ఎస్ఈ అబూదలేమ్, ఆర్డీవో రామలక్ష్మి

(5వ పేజీ తరువాయి)

నాశనమైందన్నారు. సాగు నీటి రంగంలోని సమస్యలను గుర్తించి, రైతులకు మేలు జరిగేలా కమిటీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ మరుగునపడిన వ్యవస్థను గాడిలో పెడతానికి చంద్రబాబు నడుం బిగించారని ఇందులో భాగంగానే సాగు నీటి సంఘాల ఎన్నికలన్నారు. రైతులకు ఎంతో ఉపయోగ పడే వ్యవస్థలను జగన్మోహనరెడ్డి నాశనం చేశారన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ సాగు నీటి రంగం చంద్రబాబు మానసపుత్రిక అన్నారు. నూతన కమిటీ ప్రతి ఎకరాకు నీరందించే విధంగా పని చేస్తుందన్నారు.

కాల్వలు, డ్రైయిన్లు ఆధునికీకరిస్తాం : చైర్మన్

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలు, డ్రైయిన్లను అభివృద్ధి చేస్తామని బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్మన్ పంతాని మురళీధరరావు తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో కాల్వలు, డ్రెయిన్లను అభివృద్ధి చేయలేదన్నారు. పట్టిసీమ నీటిని కూడా అందించలేదన్నారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించి సాగునీటిసంఘాలను ఏర్పాటు చేశారన్నారు. అధ్వానంగా తయారైన కాల్వలు, డ్రెయిన్లను అభివృద్ధి చేసి చివరి భూములకు కూడా సాగునీరు అందించేందుకు కృషిచేస్తామన్నారు.

కారంపూడి డీసీ అధ్యక్షుడే చైర్మన్

(5వ పేజీ తరువాయి)



సాగర్ పీసీ చైర్మన్ ఎన్నికలో పాల్గొన్న డీసీల అధ్యక్షులు

ఆధునికీకరించి సాగునీటి విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అద్దంకి బ్రాంచ్ కాల్వ చివరి భూములకు సాగునీ రు అందించేందుకు ప్రయత్నిస్తామని చక్రపాణి తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదేళ్ల సాగునీటి సంఘాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి నీటి సరఫరాలో రైతులను భాగస్వాములను చేసిందన్నారు.

రైతుల ప్రయోజనాలకు పెద్దపీట : యరపతినేని

సాగర్ ఆయకట్టులో ప్రతి ఎకరాకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు తెలిపారు. 11 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగర్ ప్రాజెక్టు సాగునీరు అందిస్తున్నా వైసీపీ హయాంలో కాల్వల మరమ్మతులు చేయకపోవడంతో రైతులు అవస్థలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు కేటాయించి పనులు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నాలుగు జిల్లాల ఎమ్మెల్యేలు మంత్రులు, డీసీల సహకారంతో గురజాలకు చెందిన పులుకూరి కాంతారావు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం హర్షణీయమన్నారు.



చిక్కులను అవగతం చేసుకుని చదివితే..

భౌతికశాస్త్రంలో అత్యధిక మార్కులు సులువే



అడుసుమల్లి రవికుమార్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు

గుంటూరు(విద్య), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సహజంగా విద్యార్థులు భయపడే సబ్జెక్టులలో భౌతిక శాస్త్రం కూడా ఒకటి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం సీబీఎస్ఈ పాఠ్య పుస్తకాలు ఉన్నప్పటికీ, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పని ఏమీ లేదు. ఎందుకంటే ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రమంతటా స్టేట్ బోర్డు పరీక్షలను నిర్వహించడానికి సన్నద్ధమయింది. 2025లో జరిగే పదో తరగతి పరీక్షలలో సైన్స్ పరీక్ష భౌతిక శాస్త్రం, జీవశాస్త్రాలకు విడివిడిగా వేర్వేరు రోజులలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందువల్ల అటు విద్యార్థుల్లోనూ ఇటు ఉపాధ్యాయుల్లోనూ ఆనందం వ్యక్తం అవుతోంది. ఎందుకంటే గతంలో రెండు సబ్జెక్టులను కలిపి ఒకే పేపర్‌గా నిర్వహించడం వల్ల విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయని పెదనందిపాడు మండలం, పుసులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, అడుసుమల్లి రవికుమార్ తెలిపారు. ఇక ఇప్పుడు 2025లో జరగబోవు పబ్లిక్ పరీక్షలలో భౌతిక శాస్త్రంలో అత్యధిక మార్కులు తెచ్చుకోవడానికి విద్యార్థులకు ఆయన ఇచ్చే సూచనలు ఇలా ఉన్నాయి...

- ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్‌సీఆర్‌టి ద్వారా మోడల్ పేపర్లను, బ్లూ ప్రింట్‌ను విడుదల చేసి అన్ని పాఠశాలలకు పంపించి తగిన మార్గదర్శనం చేసింది. విద్యార్థులు ఈ బ్లూ ప్రింట్‌ను పరిశీలిస్తూ, ఆయా పాఠ్యాంశాలకు ఉన్న వెయిటేజీకి అనుగుణంగా ప్రిపరేషన్ మొదలుపెట్టాలి.
- భౌతికశాస్త్రం ప్రశ్నపత్రం మొత్తం నాలుగు సెక్షన్లుగా 17 ప్రశ్నలతో ఉంటుంది. మొదటి సెక్షన్‌లో 1 నుంచి 8 వరకు ఒక మార్కు ప్రశ్నలు ఉంటాయి. ఈ ఎనిమిది ప్రశ్నలలో పటం వెయ్యడం, పట్టికను చూసి సమాధానాలు రాయడం, కారణాలు ఊహించడం ఉపయోగాలు తెలపడం, ప్రమాణాలు రాయడం అనే విద్యా ప్రమాణాలు కచ్చితంగా ఇస్తారు కాబట్టి విద్యార్థులు వీటిపై దృష్టి పెట్టాలి.
- రెండవ సెక్షన్‌లో 9 నుంచి 11 వరకు రెండు మార్కుల ప్రశ్నలు ఇస్తారు. వీటిలో రెండు ప్రశ్నలు కారణాలు ఊహించడం, ప్రశ్నించడం వంటి విద్యా ప్రమాణాలకు సంబంధించి ఉంటాయి. కాబట్టి విద్యార్థులు ఈ దిశగా సాధన చేయాలి.
- మూడవ సెక్షన్‌లో 12 నుంచి 14 వరకు నాలుగు మార్కుల ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న సంఖ్య 12 పటం గీయాలి. ఈ ప్రశ్నకు అంతర్గత ఎంపిక ఉంటుంది విద్యార్థులు గనక పటాలను చక్కగా సాధన చేసినట్లయితే, ఈ ప్రశ్న ద్వారా సులువుగా నాలుగు మార్కులను పొందవచ్చు. ముఖ్యంగా పుటాకార దర్పణం, కుంభాకార కటకానికి సంబంధించిన కిరణ చిత్రాలను విద్యార్థులు తప్పనిసరిగా సాధన చేయాలి.
- ఇదే సెక్షన్‌లో ఉపయోగాలు రాయడం విద్యా ప్రమాణానికి సంబంధించిన ప్రశ్న కూడా ఉంటుంది కాబట్టి బ్లీచింగ్ పౌడర్ ఉపయోగాలు, బేకింగ్ సోడా ఉపయోగాలు, వాషింగ్ సోడా ఉపయోగాలు, నిజ జీవితంలో లోహాల పాత్ర, పి.హెచ్ ప్రాముఖ్యం తదితర అంశాలను విద్యార్థులు క్షుణ్ణంగా చదివి నాలుగు మార్కులను సంపాదించే ప్రయత్నం చేయాలి.
- ఇక మరో ప్రశ్నగా పట్టిక ఇచ్చి పట్టిక కింద ప్రశ్నలు అడుగుతారు కాబట్టి పాఠ్య పుస్తకంలో ఇచ్చిన పట్టికలను విద్యార్థులు తప్పనిసరిగా సాధన చేయాలి.
- నాలుగో సెక్షనులో 15 నుంచి 17 వరకు 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. 15వ ప్రశ్న భౌతిక శాస్త్రం నుంచి, 16వ ప్రశ్న రసాయన శాస్త్రం నుంచి, 17వ ప్రశ్న భౌతిక రసాయన శాస్త్రాల అంతర్గత ఎంపిక తోనూ ప్రశ్నలను అడుగుతారు.
- ముఖ్యంగా 17వ ప్రశ్న ఒక కృత్యాన్ని గురించిన ప్రశ్న కావడం వలన విద్యార్థులందరూ కూడా కృత్యాలకు సంబంధించిన ప్రశ్నలను సాధన చేసినట్లయితే కచ్చితంగా ఎనిమిది మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంటుంది.
- ప్రశ్నపత్రం మొత్తం మీద విషయావగాహన, అంశాలను వివరించడం, కృత్యాలను రాయడం, ప్రశ్నించడం, ఊహించడం, కారణాలు తెలపడం, ఉపయోగాలు రాయడం, ప్రమాణాలు రాయడం, పటాలు గీయడం వంటి విద్యా ప్రమాణాలను సాధన చేస్తే విద్యార్థులందరూ దాదాపు 70శాతం మార్కులను తెచ్చుకునే అవకాశం ఉంటుంది.
- భౌతిక శాస్త్రం అనగానే విద్యార్థులలో సహజంగా కొంత భయం ఉన్నప్పటికీ, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పని ఏమీ లేదు. భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో విద్యా ప్రమాణాల ఆధారంగా ప్రశ్నపత్రంలోని బ్లూప్రింట్ వెయిటేజ్‌ను దృష్టిలో ఉంచుకొని పరీక్షలకు సన్నద్ధమైతే విజయం తథ్యమని భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు అడుసుమల్లి రవికుమార్ వివరించారు.

- ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు... అడపా దడపా కొనుగోళ్ళు
- కిలో రూ.250కు విక్రయం

మార్కెట్లోకి మామిడి పండ్లు



మార్కెట్లో దర్శనమిస్తున్న మామిడి పండ్లు

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో మామిడి పండ్లు దర్శనమిస్తున్నాయి. సాధారణంగా మామిడి పండ్లు వచ్చే రుతువుకు భిన్నంగా మార్కెట్లోకి రావడంతో ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. లాలాపేట పండ్ల మార్కెట్లో రెండు రోజులుగా తోపుడు బండిపై మామిడి పండ్లు కనిపించడంతో ప్రజలు అడపాదడపా కొనుగోళ్ళు చేస్తున్నారు. సాధారణంగా మండు వేసవిలో మామిడి పండ్ల సీజన్ ప్రారంభమవుతుంది. అలాంటిది రుతువుకు భిన్నంగా ప్రస్తుతం బంగినిపల్లి మామిడి పండ్లు మార్కెట్లో దర్శనమివ్వడంతో ప్రజలు ఆశ్చర్యంగా పరిశీలిస్తున్నారు. కొనుగోలు చేసేందుకు కొందరు ఆసక్తిగా చూపుతున్నారు. డజను పండ్లు రూ. 800ల నుంచి రూ.వెయ్యి వరకు విక్రయిస్తుండగా కిలో రూ.250ల వరకు విక్రయిస్తున్నట్లు లాలాపేటలో పండ్ల వ్యాపారి షేక్ జిలాని తెలిపారు. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో బంగినపల్లి మామిడి పంట అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. బెంగళూరు, చెన్నై వంటి దూర ప్రాంతాలకు ఆయా మామిడి పండ్లను ఎగుమతి చేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులుగా విక్రయాలు జరుపుతున్నామని, అడపా దడపా కొనుగోళ్ళు జరుగుతున్నాయని సదరు వ్యాపారి వివరించారు. మరికొన్ని రోజులు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గుంటూరు(విద్య), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఎన్నారై నూకవరపు శ్రీకాంత్ ఆర్థిక సహాయంతో ప్రభుత్వ ఉపాధ్యాయులచే రూపొందించబడిన స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎండీ ఖాసిం, ఎస్ఎఫ్ఐ గుంటూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు యశ్వంత్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ అభివృద్ధితోనే సమాజ పురోగతి

- మన్నవ మోహనకృష్ణ



రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్లో పాల్గొన్న ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ అభివృద్ధితోనే సమాజం పురోగమిస్తుందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. ఎస్సార్‌ఎం యూనివర్శిటీలో శనివారం జరిగిన రెండో రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్‌కు ఆయన ముఖ్య అతి థిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ మారుతున్న సమా జానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు టెక్నాలజీ అభివృద్ధి చెందుతోందని, టెక్నాలజీతో సమాజం మరింత ముందుకు సాగుతుందని చెప్పారు. నూతన టెక్నాలజీని కనుగొనేం దుకు చేసే ప్రయత్నాలకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. నేటి తరానికి టెక్నాలజీపై అవగాహన ఉండటం అవసరమని అన్నారు.

● శాస్త్ర, సాంకేతిక రంగాలతోనే అభివృద్ధి

శాస్త్ర, సాంకేతిక రంగాలతోనే అభివృద్ధి సాధ్యమని ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. విజయవాడలోని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ కార్యాలయంలో విభాగాధిపతులు, అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విభాగాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు ద్వారా అందిస్తున్న సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ప్రొక్యూర్మెంట్స్ ఇంకా విస్తృత పరిచి ఏపీటీఎస్‌కి మరింత ఆదాయం పెంచాలని సూచించారు.

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు



గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాజీపేట - విజయవాడ సెక్షన్‌లో మోటుమర్రి వద్ద నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా గుంటూరు నుంచి ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, నంబరు. 12706 సికింద్రాబాద్ - గుంటూరు రైలును ఈ నెల 28, 29, జనవరి 2, 5, 7, 8, 9 తేదీల్లో పూర్తిగా రద్దు చేస్తున్నామన్నారు. నంబరు. 17201/17202 గుంటూరు - సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ్ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 27 నుంచి జనవరి 9వ తేదీ వరకు కాజీపేట వరకే నడిపి వెనక్కు మళ్లించడం జరుగుతుందన్నారు. ఈ నెల 26 నుంచి జనవరి 8వ తేదీ వరకు నంబరు. 18519 విశాఖపట్టణం - ముంబై ఎల్‌టీటీ, జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు నంబరు. 18045 షాలిమార్ - హైదరాబాద్, జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు నంబరు. 18046 హైదరాబాద్ షాలిమార్, నంబరు. 17205 సాయినగర్ షిర్డి - కాకినాడ పోర్టు రైలుని జనవరి 7న, నంబరు. 17206 కాకినాడ పోర్టు - సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 8న, నంబరు. 17207 సాయినగర్ షిర్డి - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 8న, నంబరు. 17208 మచిలీపట్నం - సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 7న విజయవాడ - గుంటూరు - పగిడిపల్లి - సికింద్రాబాద్ - వికారబాద్ మీదగా దారి మళ్లించడం జరుగుతుందన్నారు. నంబరు. 11019 ముంబై సీఎస్‌ఎంటీ - భువనేశ్వర్, నంబరు. 11020 భువనేశ్వర్ - ముంబై సీఎస్‌ఎంటీ ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు, వాడి - వికారాబాద్ - సికింద్రాబాద్ - పగిడిపల్లి - గుంటూరు - విజయవాడ మీదగా దారి మళ్లిస్తామన్నారు. నంబరు. 22849 షాలిమార్ - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 1, 8 తేదీల్లో, నంబరు. 20833 విశాఖపట్టణం - సికింద్రాబాద్ విజయవాడ - గుంటూరు - పగిడిపల్లి -సికింద్రాబాద్ మార్గంలో దారి మళ్లిస్తామని తెలిపారు. నంబరు. 12774 సికింద్రాబాద్ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 7న రాజమండ్రి - విజయవాడ - గుంటూరు - పగిడిపల్లి - సికింద్రాబాద్ మీదగా దారి మళ్లిస్తామన్నారు. ఆపరేషనల్ కారణాల వలన ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నంబరు. 07276 కాచీగూడ - మిర్యాలగూడ, నంబరు. 07277 మిర్యాలగూడ - నడికుడి, ఈ నెల 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు నంబరు. 07973 నడికుడి - మిర్యాలగూడ, నంబరు. 07974 మిర్యాలగూడ - కాచీగూడ రైళ్లను రద్దు చేశామన్నారు. నంబరు. 07791 కాచీగూడ - నడికుడి, నంబరు. 07792 నడికుడి - కాచీగూడ రైలుని ఈ నెల 26 నుంచి జనవరి 28వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

174 వసంతాల ఆర్‌సీఎం చర్చి



రెంటచింతల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా రెంటచింతలలో నిర్మించిన చర్చిలు జిల్లాకే తలమానికంగా ఉంటాయి. ఎంతో ఎత్తుండే ఈ ప్రార్థనాలయాల శిఖరాలను చూడడానికి తల నిటారుగా ఎత్తాల్సిందే! ఆర్‌సీఎం మతస్తులు అధికంగా ఉండే ఈ గ్రామంలో 1850లో కానుకమాత చర్చిని నిర్మించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు అనగా 97 సంవత్సరాల పూర్వమే రూ.4 వేల వ్యయంతో అప్పట్లో ఈ చర్చి రూపుదిద్దుకుంది. 1832లో బ్రిటీష్ ఈస్టు ఇండియా కంపెనీకి చెందిన బ్రట్ జేమ్స్ దాసన్ క్రీస్తు ప్రార్థనా మందిర నిర్మాణానికి పూనుకోగా అది 1850లో పూర్తయినట్లు మాజీ సర్పంచ్ అల్లం మర్రెడ్డి చెప్పారు. 70 అడుగుల ఎత్తు 1000 మంది భక్తులు కూర్చొనే విధంగా ఈ ప్రార్థనా మందిరాన్ని తీర్చిదిద్దారు. అప్పట్లో సిమెంట్ లేకపోవడంతో సున్నంతో గానుగ ఆడించి నాపరాళ్లతో నిర్మించారు. ఆ రోజుల్లో ఫాదర్ ఆదేశాల మేరకు ప్రతి క్రైస్తవ కుటుంబం నుంచి ఒకరో ఇద్దరు వచ్చి నిర్మాణ పనుల్లో పాలుపంచుకునే వారు. 13 ఎకరాల విస్తీర్ణంలో వున్న ఈ చర్చికి అనుబంధంగా 1978లో మరో చర్చిని నిర్మించారు. దీనిని ప్రస్తుతం రూ.5 కోట్లతో ఆధునీకరిస్తున్నట్లు ఫాదర్ వైఎల్ మర్రెడ్డి చెప్పారు. 174 వసంతాలు నిండినా ఆ చర్చి చెక్కు చెదరకపోవడం విశేషం.

ఇద్దరు రైల్వే అధికారులకు జాతీయ అవార్డులు



జేవీ అనూష, రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీర్(కో-ఆర్డినేషన్)



పీ ఆదినారాయణ, సీనియర్ సెక్షన్ ఇంజనీర్(కన్‌స్ట్రక్షన్)

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్‌కు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులకు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. శనివారం న్యూఢిల్లీలో జరిగిన 69వ రైల్వే వారోత్సవాల్లో ఈ అవార్డులను రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రదానం చేశారు. సీనియర్ డివిజనల్ ఇంజనీర్(కో-ఆర్డినేషన్) జవ్వాది వెంకట అనూషకు కొత్త ఆవిష్కరణలు, ప్రక్రియలు, ఆర్థిక వ్యవస్థలలో చేసిన కృషికి అతి విశిష్ట సేవా పురస్కార్-2024 అవార్డు లభించింది. అలానే గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్‌లో కొన్ని విభాగాలను పూర్తి చేయడంలో కీలకపాత్ర పోషించిన సీనియర్ సెక్షన్ ఇంజనీర్ పీ ఆదినారాయణకు కూడా అవార్డు లభించింది. వీరిద్దరిని గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ, ఇతర అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

గొప్పవారి స్ఫూర్తితో విజేతలుగా ఎదగాలి

- ఘనంగా ప్రారంభమైన వివా వీవీఐటీ 2024-25



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థినులు..



మాట్లాడుతున్న వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): యువజనోత్సవాలు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని విజ్ఞాన్ నిరులా ప్రిన్సిపాల్ పాతూరి రాధిక అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయస్థాయి యువజనోత్సవం వివా-వీవీఐటి 2024-25 వేడుకలు ఘనంగా శనివారం ప్రారంభమయ్యాయి. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించి, క్రీడాజ్యోతిని వెలిగించి ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ, విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసేలా కృషి చేయాలని అన్నారు. గొప్పవారి నుంచి స్ఫూర్తిపొంది విజేతలుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి నేపథ్యంగా ఎంచుకున్న ది వరల్డ్ ఈజ్ వన్ (ప్రపంచమంతా ఏకం) నేపథ్యాన్ని ప్రతిబింబించేలా వసుధైక కుటుంబాన్ని చాటేలా కళాశాల ప్రాంగణం మొత్తం ప్రపంచ దేశాలలోని సంస్కృతులు, పురాణాల ఆకృతులతో తీర్చిదిద్దారు. హిందూ తత్వశాస్త్రం, తాత్విక, భౌతిక భావనలను కలిగివున్న పవిత్ర సాధనం శ్రీచక్రం ఆకృతి ఆకట్టుకుంది. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల వస్త్రధారణతో కూడిన ప్రతిరూపాలను యువజనోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. సాంస్కృతిక, సాంకేతిక, క్రీడా విభాగాల నుంచి 94 అంశాలలో పోటీలు నిర్వహించగా వివిధ కళాశాలకు చెందిన 4500 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. తొలిరోజు విద్యార్థులు పెద్ద ఎత్తున క్రీడా పోటీలలో పాల్గొని విశేషంగా రాణించారు. తొలిరోజు ముగింపు కార్యక్రమంలో అతిథులుగా వీవీఐటి కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వి జాన్సన్ అండ్ జాన్సన్ ఐటి మేనేజర్ ఆదిశేషారెడ్డి, అమెరికన్ ప్రొఫెసర్ దండు రాజు పాల్గొన్నారు. తొలిరోజు పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ ఎస్. కుమారస్వామి అధ్యాపకులు పాల్గొన్నారు.



యువజన ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు. కళాశాల యాజమాన్యం

పల్నాడు వార్తలు

నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 21: పమిడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజుపాలెంలో రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమంలో భాగంగా 6 - 15 సంవత్సరాల విద్యార్థులకు శనివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఈ వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థుల ఎత్తు,బరువు, తల చుట్టు కొలత, వారి ఆరోగ్య పరిస్థితులను వైద్యులు పరిశీలించారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

రొంపిచర్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. గోగులపాడు సర్పంచ్ పొనుగోటి నాసరరావు మాట్లాడుతూ జగనన్న కాలనీకి సంబంధించి మట్టి తోలకం నిధులు మంజూరు కాలేదని, గ్రామంలో నిర్మించిన మినీ గోకులానికి నిధులు మంజూరు కాలేదని తెలిపారు. అదే విధంగా ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు తక్కువ ఎత్తులో ఉన్నాయని, మరికొన్ని విరిగిపోయి ఉన్నట్లు తెలిపారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంబంధిత అధికారులు మాట్లాడుతూ ఇందుకు నివేదికలు పంపామని, త్వరలో నిధులు మంజూరు కానున్నట్లు చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. తహసీల్దార్ బండి నిర్మల మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఆధ్వ ర్యంలో జరుగుతున్న సదస్సుల్లో భూ యజమానులు తమ సమస్యలను అర్జీల రూపంలో అం దించేలా ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం బాల నాగమ్మ, ఎంపీడీవో మాధ్యూబాబు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వినియోగం నిషిద్ధం

నరసరావుపేట రూరల్, డిసెంబరు 21: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చికెన్, మటన్ దుకాణ యజమానులందరూ తమ దుకాణాలలో వచ్చే వ్యర్థాలను ఆక్వా రంగంలో వినియోగించడం పూర్తిగా నిషేధమని మునిసిపల్ కమిషనర్ జస్వంత్‌రావు తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ అధ్యక్షతన ఏఆర్ ఫిషరీ ప్రొడక్ట్స్ (భీమవరం) ఆధ్వర్యంలో స్థానిక చికెన్, మటన్ దుకాణాల యజమానులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్వంత్‌రావు మాట్లాడుతూ చికెన్ మటన్ దుకాణాలో వచ్చే వ్యర్థాలను చేపలు, రొయ్యల చెరువులకు అందజేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సంజీవరావు, ఎఫ్‌డీవో బాగ్యలత, ఏఆర్ ఫిషరీష్ ప్రతినిధి డాక్టర్ బూసి గోపినాద్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రామకోటయ్య, పీ రమాదేవి పాల్గొన్నారు.

కాల్వను సందర్శించిన అధికారులు

వినుకొండటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విఠంరాజు పల్లి సమీపంలోని బ్రాహ్మణపల్లి మైనర్ కాల్వను ప్రజా సంఘాల నాయకులతో కలిసి అధికారులు శనివారం సందర్శించారు. కాల్వకు ఇరువైపులా ఉన్న భారీ చెట్లతోపాటు సిమెంట్ డ్రాపులను పరిశీలించారు. నీటి ప్రవాహంపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌పీ అధికారులు హేమంత్‌కుమాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

వినుకొండటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టరు బీఆర్ అంబేడ్కర్ పై బీజేపీ నాయకులు అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ ఆదేశాల మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. నిరసనలో రాష్ట్ర అధ్యక్షులు గోదా జాన్‌పాల్, నియోజకవర్గ అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా ధ్యాన దినోత్సవం

నూజెండ్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దవరం ప్రభుత్వ పాఠశాలలో శనివారం మొట్ట మొదటి ధ్యాన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి డిసెంబరు 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆధునిక జీవన విధానంలో రోజురోజుకు పెరుగుతున్న మానసిక ఒత్తిడి, హింస, క్షీణిస్తున్న మానవ సంబంధాలను మానసిక స్థైర్యంతో నియంత్రించు కోవచ్చని వక్తలు పేర్కొన్నారు.

నేడు 'కామ్రేడ్ కాళిదాసు' సంచిక ఆవిష్కరణ

యడ్లపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అర్ధశతాబ్దానికి పైగా ప్రజా సాంస్కృతికోద్యమ పతాక ప్రజానాట్యమండలి నిర్మాతగా, మార్క్సిస్టు పార్టీ నాయకుడిగా సేవలు అందిస్తున్న నూతలపాటి కాళిదాసు పేరుతో గుంటూరు సంస్కృతి రూపొందించిన 'కామ్రేడ్ కాళిదాసు' అభినందన సంచికను ఆదివారం ఆవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహకులు తెలిపారు. గుంటూరులోని ఎన్‌జీవో కల్యాణమండపంలో సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

కేబుల్ ఆపరేటర్ పై దాడి

నరసరావుపేట లీగల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారు లింగంగుంట రాజుపాలెంకు చెందిన కేబుల్ ఆపరేటర్ అంకిరెడ్డిపై శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు, అంకిరెడ్డి బంధువు తన ద్విచక్రవాహనంపై వెళుతుండగా మొదటి రైల్వేగేటు వద్ద మరొకరి ద్విచక్రవాహనం ఢీకొట్టింది. అయితే, అంకిరెడ్డి బంధువు ఈ సమాచారాన్ని అంకిరెడ్డికి ఫోన్ చేసి చెప్పారు. సంఘటనా స్థలం వద్దకు అంకిరెడ్డి వెళ్లారు. బంధువు వాహనాన్ని ఢీకొట్టిన ద్విచక్రవాహనదారుడికి సంబంధించిన గుర్తుతెలియని ఐదుగురు వ్యక్తులు అక్కడికి వచ్చారు. ఈ క్రమంలో అంకిరెడ్డిపై, ఆయన బంధువుపై వారు దాడి చేశారు. బాధితులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి బంగారు ఆభరణాలు, నగదు బలవంతంగా లాక్కున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి రైతు కుటుంబంలో సంతోషమే ఆశయం

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

నరసరావుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రతిరైతు కుటుంబం సంతోషంగా ఉండాలని, ఆర్థిక ప్రగతి సాధించాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయమని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక భువనచంద్ర టౌన్‌హాల్‌లో శనివారం నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి ప్రమాణ స్వీకారోత్సవ సంభలో ఆయన పాల్గొన్నారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ సమృద్ధిగా సాగు నీరు, పంటలకు గిట్టుబాటు ధరలు, ఇతర సౌకర్యాలు కల్పిం చడం ద్వారా రైతుల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే చంద్రబాబు లక్ష్యమన్నారు. వ్యవ సాయంపై ఆధారపడిన రాష్ట్రంలో రైతులకు నీటి భద్రత కల్పించాల్సి ఉందన్నారు. పోలవరంతో పాటు 6 ప్రధాన ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేయడం లక్ష్యమని, కొత్తగా ఎన్నికైన నీటి



కాంతారావును సత్కరిస్తున్న జీవీ, యరపతినేని, ప్రత్తిపాటి, డాక్టర్ అరవిందబాబు

సంఘాల కమిటీలు ఆయకట్టులో ప్రతి చివరి ఎకరాకు సక్రమంగా నీళ్లందేలా పర్యవేక్షించాలని సూచించారు. గోదావరి, పెన్నా నదుల అనుసంధానాన్ని త్వరలోనే పూర్తి చేసి 9.61 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో బొల్లాపల్లి రిజర్వాయర్ కూడా వచ్చి తీరుతుందన్నారు. వరికెపూడిశెల ప్రాజెక్టు కోసం ఎమ్మెల్యేలు, ఎంపీ అంతా సీఎంతో మాట్లాడామని, ఈ ప్రాజెక్టును కూడా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కాంతారావు, వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణిని ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, తెలుగుదేశం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, టీటీడీ పాలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

త్రిపురాపురం డీసీకి అభినందనలు

నూజెండ్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాపురం డీసీగా ఎన్నికైన, గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంగినేని రాఘవను ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అభినందించారు. నరసరావుపేటలో శనివారం నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు చైర్మన్ పులుకూరి కాంతారావు ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాఘవను సన్మానించారు.

ఏసుప్రభు జీవితమే మానవాళికి ఓ సందేశం

నరసరావుపేట రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏసుప్రభు జీవితమే మానవాళికి ఓ సందేశ మని కలెక్టర్ పీ అరుణ్‌బాబు తెలిపారు. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో శనివారం హై-టీ కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాంతి, దయ, కరుణ ఏసు మార్గమేనని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, చర్చి ఫాదర్లు, చర్చి పెద్దలు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

ఘనంగా ఐక్యక్రిస్మస్ వేడుకలు

వినుకొండ , డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూపయనించి ప్రేమ, దయ,కరుణ కలిగి ఉండాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్టు చర్చి ఆవరణలో శనివారం ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఇమ్మానుయేలు తెలుగుబాప్టిస్టు ప్రెసిడెంట్ చాట్ల రామయ్య అధ్యక్షత వహించారు. చర్చి పాస్టర్ స్పర్జన్, లూథరన్ చర్చి పాస్టర్ మహేష్, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ప్రసాద్‌లు సందేశం ఇచ్చారు. అనంతరం జీవి ఆంజనేయులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏఎంరెడ్డి విద్యాసంస్థలలో సెమీ క్రిస్మస్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి విద్యా సంస్థలలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ సామాజిక సమానత్వం, ప్రేమ, శాంతి, సంక్షేమం గురించి తెలియజేస్తుందన్నారు. క్రిస్మస్ కేవలం ఒక పండుగ కాదని, అది మనలోని మంచి గుణాలను పరిపూర్ణంగా నింపడానికి ఒక గొప్ప అవకాశం అని అన్నారు. బీ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవభూషణరావు మాట్లాడుతూ క్రిస్మస్ అనేది శాంతి, సమాధానం, సహకారం చిహ్నం అన్నారు. ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలు అపూర్వమైన సందేశాన్ని ఇస్తాయన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రసంగాలు ప్రత్యేక అకర్షణగా నిలిచాయి. క్రిస్మస్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సాయి తిరుమల సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో..

నరసరావుపేట లీగల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సాయి తిరుమల సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో శుక్రవారం సాయంత్రం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయి తిరుమల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ వెంకట్రావు ,చైర్మన్ డాక్టర్ వై వెంకట్రామయ్య, ఎండీ డాక్టర్ శివ ప్రదీప్, వైద్యులు శ్వేతా, లక్ష్మీ మానస ,దివ్య ,మౌనిక మేనేజర్లు వెంకట్రామయ్య, అశోక్ వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ సుభాష్ ఏసు బోధనలు వినిపించి ప్రత్యేక ప్రార్థన చేశారు. కార్యక్రమానికి సిబ్బంది క్యాండిల్స్ వెలిగించి యేసును ప్రార్థించారు.

క్రీస్తు బోధనలు అనుసరించాలి

నాదెండ్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మానవుల కోసం రక్షకుడిగా జన్మించిన క్రీస్తు బోధనలను అనుసరించాలని ఎస్ఐ జీ పుల్లారావు అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్లలోని చైతన్యనగర్ కాలనీలోని ఏఈఎల్‌సీ చర్చిలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ మోహన్‌రావు క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. సంఘం తరపున వంద మంది విద్యార్థులకు దుస్తులు, ఆర్మీ ఉద్యోగి జొన్నలగడ్డ కిరణ్ కుమార్ అందించిన వంద దుప్పట్లను పంపిణీ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ప్రిన్సిపాల్ మాధవీలత, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సమాజ సేవ చేసే వారికి తోడ్పాటు అందించాలి



బాసట ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

యడ్లపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమాజ హితం కోసం పాటుపడే యువకులకు అన్ని విధాలా తోడ్పాటు అందించాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి పీ రజిని అన్నారు. యడ్లపాడు గ్రామాభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్‌లు ఏర్పాటు చేసిన సామాజిక సాంస్కృతిక వేదిక బాసట ట్రస్టును శనివారం ఆమె ప్రారంభించారు. స్థానిక పీఆర్ విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రజిని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సేవకోసం యువత ప్రత్యేకంగా ట్రస్టును ఏర్పాటు చేసి ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రామీణ యువతను అభినందించడంతోపాటు ఆర్థిక చేయూతను అందించి ప్రోత్సహించాలని సూచించారు. అప్పుడే గ్రామాలు ఆదర్శ గ్రామాలుగా వెలుగొందుతాయన్నారు. మరో అతిథి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ యడ్లపాడు, లింగారావుపాలెంతో తనకు ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. రెండు గ్రామాల్లోని యువత చేసే సామాజిక కార్యక్రమాలు గ్రామానికే కాకుండా రాష్ట్రానికే ఆదర్శమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి గ్రామంలోని యువత ముందుకు రావాలని, సామాజిక సేవలో పాలుపంచుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నూతలపాటి కాళిదాసు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ళగా యడ్లపాడు అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్‌ల పేరుతో విద్య ఆరోగ్యం, పచ్చదనం పెంపొందించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు చెప్పారు. వాటన్నింటినీ కలిపి ఒకే వేదికగా ఏర్పడి ముందుకు సాగాలని నిర్ణయించి బాసట పేరుతో ఈ ట్రస్టును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ వేదికకు అధ్యక్ష , కార్యదర్శులుగా నూతలపాటి కాళిదాసు, సామినేని వెంకటేశ్వర్లు , ఉపాధ్యక్షులుగా రావూరి సుమన్, శొంఠినేని శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా ముత్తవరపు రవీంద్రబాబు, పోపూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా కేతా రాంబ్రహ్మంలు వ్యవహరిస్తారని తెలిపారు. వీరుగాక మరో ఏడుగురు సభ్యులుగా ఉండి ఈ బాసట వేదికను ముందుకు నడిపిస్తారన్నారు. కార్యక్రమంలో ఫిజిషియన్ డాక్టర్ లింగమల్లు మోహన్ భాస్కర్, ఆలోకం పెదఅబ్బయ్య, పోపూరి గంగయ్యచౌదరి, డాక్టర్ పోపూరి రమేష్‌బాబు, పోపూరి అనంతలక్ష్మి, నంబూరు నరసింహారావు ఇరు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు

రొంపిచర్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేక కార్యక్రమాలను అర్చకులు రత్నాకరం రామకృష్ణమాచార్యులు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను అంద జేశారు.

నేడు పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రొంపిచర్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో పోలేరమ్మ తల్లి, పోతురాజుస్వామి, శిఖర, కలస, శిలా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ప్రతిష్ఠా మహో త్సవ అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఆలయ ఆవరణలో కొమ్మూరి విశ్వరూపాచార్యులు సిద్ధాంతి ఆధ్వర్యంలో, కొలగాని ఉమామహేశ్వర శర్మల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

చిలకలూరిపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలను మాజీమంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, శ్రేణులకు పంచిపెట్టారు. ర్యాలీగా ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వెళ్లారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

నరసరావుపేట రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ 52వ పుట్టినరోజు వేడుకలు మాజీ శాసనసభ్యుడు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత లింగంగుంట్లలోని పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం పట్టణంలోని రామిరెడ్డిపేట పాత సమితి ఆఫీస్ వద్ద, అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రకాష్ నగర్ లోని జాయ్ హోం వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేశారు. వైసీపీ నాయకులు పొన్నపాటి ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

నరసరావుపేట రూరల్, డిసెంబరు 21: వరి పంటను సాగుచేసిన రైతులందరూ దళారులను ఆశ్రయించి మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐ. మురళి తెలిపారు. పల్నాడు జిల్లాలో 2024 ఖరీఫ్ సీజన్ 34,396 హెక్టార్లలో వరి పంటను వేయడం జరిగిందన్నారు. జిల్లాలో సాగు విస్తీర్ణం ఆధారంగా 115 క్లస్టర్లను ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 50 మంది రైతుల వద్ద నుంచి 317 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. సాధారణ ధాన్యం 77 కేజీల బస్తా ధర రూ.1725, గ్రేడ్ ఎ రకము రూ.1740 కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



వరి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి

ప్రసాద్‌కు వినియోగదారుల ఉత్తమసేవా పురస్కారం

చిలకలూరిపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పల్నాడు జిల్లా వినియోగదారుల పరిరక్షణ ఫోరం ఇన్‌చార్జి మురికిపూడి ప్రసాద్ కు వినియోగదారుల ఉత్తమ సేవా పురస్కారాన్ని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె శనివారం ప్రదానం చేశారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఓ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి బీ నారదముని, తూనికలు కొలతలు అధికారులు అల్లూరయ్య, శంకరరావు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞనారాయణ ఫోరం కోశాధికారి విక్రమ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 9 అర్జీలు స్వీకరణ

వినుకొండటౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలను గ్రామ రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవచ్చునని తహసీల్దార్ సురేష్ తెలిపారు. మండలంలోని నడిగడ్డలో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని భూ సమస్యలపై తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. తమ పరిధిలో పరిష్కరించదగిన సమస్యలను ఆర్ఐ శ్రీహరి సాయంతో వెంటనే పరిష్కరించడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల సహాయంతో పరిష్కరించాల్సిన మరో 9 అర్జీలను స్థానికుల నుంచి ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆంజనేయులు, రామకృష్ణ పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సుకు హాజరైన స్థానికులు

భూ సమస్యల పరిష్కారం

శానంపూడి(శావల్యాపురం)డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలతో భూసమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని మండల తహసీల్దార్ కె.సుజాత అన్నారు. మండలంలోని శానంపూడి సచివాలయంలో రెవెన్యూ గ్రామసభను శనివారం నిర్వహించారు. రైతులు వివిధ రకాల రెవెన్యూ సమస్యలను తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. భూసమస్యల పరిష్కారానికి ఐదుగురు రైతులు దరఖాస్తులు చేసుకొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామసభల్లో రైతులు ఎటువంటి రుసుములు చెల్లించకుంగా ప్రభుత్వం ఉచితంగా దరకాస్తులు చేసుకొనే అవకాశాన్ని కల్పించిందన్నారు. గ్రామసభలో వచ్చిన దరకాస్తులు తక్షణమే పరిష్కరించేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అమృతపూడి కోటయ్య, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పి.నాసరయ్య, మండల సర్వేయర్ రాజు, వీఆర్వోలు రాధ, ఆదెయ్య విలేజ్ సర్వేయర్‌లు రవి, భాస్కర్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకులపై ఫిర్యాదు

ఈపూరు,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): గ్రామంలో పేదలు సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూములను గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు ఆక్రమించి అధికారుల అండతో అమ్ముకున్నారని కొచ్చెర్ల గ్రామస్థులు తహసీల్దారు ఎ నళినికి ఫిర్యాదు చేశారు. కొచ్చెర్లలో సచివాలయం వద్ద శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. ముందుగా రీసర్వే హద్దులు నిర్వహించే కార్యక్రమానికి తహసీల్దారు, సర్వేయర్, టీడీపీ నాయకులు ప్రారంభించారు. అనంతరం జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామస్థులు ఆక్రమణకు గురైన భూముల విరాలను రెవిన్యూ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికారప్రతినిధి రాపర్ల జగ్గారావు, మండలపార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్యఐనాల కోటేశ్వరరావు, నర్రా కిశోర్, గోనుగుంట్ల శ్రీనివాసరావు, నెల్లూరి శివరామయ్య, ఆర్ఐ శ్రీనివాసరావు,కూరాకుల శ్రీనివాసరావు,

గోపాలం నాగేశ్వరరావుకు ఘన నివాళి

చిలకలూరిపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం బొప్పూడి మాజీ గ్రామ మునసుబు, రాజాపేట మాజీ సర్పంచ్ టీడీపీ సీనియర్ నాయకుడు గోపాలం నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతి బొప్పూడిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. నాగేశ్వరరావు కుమారుడు శ్రీనివాసరావు, రమేష్ బాబు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



నాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

బీమా చెక్కులు అందజేత

రొంపిచర్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోగులపాడు పాల కేంద్రం సభ్యుడు షేక్ మహబూబ్ సుభాని, ఈపూరు మండలం చిట్టాపురం పాల కేంద్రం సభ్యుడు గంగిరేకుల నాగేశ్వరరావులు అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలకు ఆర్థిక సాయంగా డీవీసీ అభయ సంక్షేమ పథకం కింద చెక్కులను శనివారం అందజేశారు. సంగం డెయిరీ మేనేజర్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సూచన మేరకు రూ.70 వేలు, రూ.60 వేలు చెక్కులను జోనల్ మేనేజర్ నరేష్, డైరెక్టర్ ఆంజనేయులు, వారి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రొంపిచర్ల ఇన్‌చార్జి కిరణ్ కుమార్, సూపర్ వైజర్ కృష్ణారెడ్డి, గోగులపాడు పాలపాడు కేంద్రం అధ్యక్షుడు అంకయ్య, చిట్టాపురం అధ్యక్షుడు చిన అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజ నీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం శని వారం నిర్వహించారు. స్థానిక యోగా కేంద్రం నిర్వాహకులు ఆనందరాముడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత మెరుగుపడుతుందని, ధ్యానం పద్ధతుల గురించి వివరిం చారు. విద్యార్థులు ధ్యానం, ఆసనాలను సాధన చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ దైనందిన జీవితంలో కొంత సమయాన్ని ధ్యానం చేయడానికి కేటాయించడం ద్వారా ఉత్సాహంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ఎన్ఎస్ఎస్ పీవో హెచ్ గంగాధరరావు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కంపెనీకి ఎంపికైన 'కృష్ణవేణి' విద్యార్థులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శనివారం ఇంటిగ్రేటెడ్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. టెక్నికల్, హెచ్ఆర్ రౌండ్లు నిర్వ హించి 29 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు డిగ్రీ పూర్తయిన అనంతరం విధులలో చేరాల్సి ఉంటుందని హెచ్ఆర్ డీ వరదరాజన్ తెలిపారు. ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ చదువుతోపాటు ఉద్యోగ కల్పనే లక్ష్యం అన్నారు. ఎంపికైన విద్యార్థులను టీపీవో ఎం బాలకోటేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించండి

నరసరావుపేటరూరల్, డిసెంబరు 21: (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయక సంఘ నేతలు కోరారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ పల్నాడు జిల్లా కమిటీ నరసరావుపేట డివిజన్ ఆర్డీఓ మధులతకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా గ్రామ రెవెన్యూ సంఘ నాయకులు మాట్లాడుతూ నరసరావుపేట డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అటెండర్, నైట్‌వాచ్‌మెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను గ్రామ రెవెన్యూ సహాయకులతో భర్తీ చేయాలని కోరారు. గ్రామ రెవెన్యూ సహాయకులు అందజేసిన వినతిపత్రం పరిశీలించిన ఆర్డీవో సానుకూలంగా స్పందించారని, ఖాళీ పోస్టులను సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా అధ్యక్షుడు షేక్ బందగి సాహెబ్, నరసరావుపేట మండల ప్రధాన కార్యదర్శి రఫీ, రొంపిచర్ల మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, నకిరేకల్లు మండల అధ్యక్షులు కాసులు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సత్తెనపల్లి మండల అధ్యక్షులు రవి, ప్రధాన కార్యదర్శి మునాఫ్ పాల్గొన్నారు.



ఆర్డీవో మధులతకు వినతిపత్రం అందజేస్తున్న రెవెన్యూ గ్రామ సహాయక సంఘం నేతలు

మోడరన్ స్టెల్లార్ స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం

చిలకలూరిపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు గణితం అంటే భయాన్ని పోగొట్టుకొని భవిష్యత్‌లో గణిత శాస్త్రవేత్తలు గా ఎదిగేందుకు కృషి చేయాలని మోడరన్ విద్యాసంస్థల డైరెక్టర్ చేబ్రోలు మహేష్ అన్నారు. ఈ నెల 22 న జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒక రోజు ముందుగానే శనివారం స్థానిక మోడరన్ స్టెల్లార్ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుండే గణిత సూత్రాలను అవపోసనపట్టి గణిత ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న రామానుజన్ భారతీయుడు కావడం గర్వకారణమన్నారు. నేటి తరం రామా నుజాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. గణిత దినోత్సవ వేడుకలలో భాగంగా పాఠశాల ఆవరణ అంతా రామానుజన్ గణిత పార్కుగా మార్చారు. పార్కులో గణిత చెట్టు, గ్రాఫ్, త్రిభుజాల ఎత్తుల దూరాలు, సంభావ్యత వంటి గణిత సూత్రాలతో చేసిన ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రతి తరగతి గదిలో అంకెలతో, గణిత గుర్తులతో, రోమన్ అంకెలతో,గణిత సూత్రాలతో అలంకరించారు. ప్రతి తరగతి వద్ద ఫ్యాక్ట్స్ ఆఫ్ మాథ్స్ ఫన్ మాథ్స్ మ్యాజిక్ మ్యాథ్స్‌లలోని వివరాలను తెలియజేస్తూ ఉంచిన చార్టులు గణిత శాస్త్రంలో గల రకరకాల పద్ధతులను తెలియజేశాయి. అలానే విద్యార్థులతో కూడికలు, తీసివేతలు, హెచ్చవేతలు, భాగాహారాలు, క సా గు, గ సా భా వంటి వాటిని అతి తక్కువ సమయంలో చెప్పించారు. నంబర్లను వెనక నుంచి చెప్పటం, మ్యాథ్స్ టేబుల్స్ వెనక నుంచి చెప్పటం, పజిల్స్ పూర్తి చేయటం వంటివి నిర్వహించారు. ప్రత్యేకంగా నిర్వహించిన గణిత క్విజ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో మోడరన్ విద్యా సంస్థల చైర్మన్ చేబ్రోలు మహేష్, ప్రిన్సిపాల్ దేవులపల్లి ఫణి కుమార్, గణిత ఉపాధ్యాయిలు వంశీ, షబ్బీర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు దాతల సహకారం అభినందనీయం

కారుమంచి(శావల్యాపురం)డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులకు దాతలు స్వచ్ఛందంగా తమవంతు సహకారాన్ని అందించడం అభినందనీయమని పాఠశాల హెచ్ఎం సుధాకర్ అన్నారు. మండలంలోని కారుమంచికి చెందిన ఆర్మీ సైనికుడు పోలా అంకమ్మారావు, అనూషల దంపతుల కుమారుడు, కుమార్తె పుట్టినరోజు సందర్భంగా శనివారం సరోజినీదేవి బధిరుల ఆశ్రమ పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. అంకమ్మారావు మాట్లాడుతూ దివ్యాంగులకు సహకరించడం ప్రజలందరి కర్తవ్యమని, ప్రభుత్వంతో పాటు దాతలు కూడా దివ్యాంగులకు సహకరించాలని కోరారు. ఉపాధ్యాయులు గుంటకల అంకమ్మారావు, నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మి, అనూష, రత్నకుమారి పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల ఇరుముడి

బొల్లాపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లటూరులో అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం వైభవంగా జరిగింది. 41 రోజుల దీక్ష విరమణ సందర్భంగా ఆరు వేల మందికి భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాలదారుల స్వాముల ఊరేగింపు జరిగింది.